జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php



కావలెను

రాష్ట్ర వ్యాప్తంగా నూతన శకాన్ని లిఖించబోతున్న

పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి

ఆంధ్రప్రదేశ్ 175 నియోజకవర్గాల నుంచి 175 మంది వాలంటీర్స్ ని నియమిస్తుంది.

ప్రతి వాలంటీర్ కు

నెలకు Rs.25,000/-

Salary ఇవ్వబడును.

విద్యా, వయసుతో సంబంధం లేకుండా ఎవరైనా వాలంటీర్ గా చేరవచ్చు.

ఆసక్తి గలవారు మీ బయోడేటాను ఆధార్ కార్డు తో సహా

మీ ప్రాంతంలో ఉన్న పార్స్ లీడర్స్ ని సంప్రదించవచ్చు.

లేదా ఈ క్రింది నెంబర్

7660027683 కి వాట్సాప్ చేయగలరు.



సంపుటి 15 సంచిక 310 విశాఖపట్నం | శుక్రవారం 07 జులై 2023 | 8 పేజీలు | వెల : 5.00


## గట్టి సంకల్పంతో ఇళ్ల నిర్మాణం పూర్తిచేయాలి: జగన్



అమరావతి: గట్టి సంకల్పంతో ఇళ్ల నిర్మాణం పూర్తిచేయాలని ఎపి సిఎం జగన్మోహన్‌రెడ్డి అధికారులకు సూచించారు. గఅహ నిర్మాణ శాఖపై తాడేపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం సమీక్ష చేపట్టారు. జగనన్న కాలనీల నిర్మాణాల పురోగతిపై సమీక్షించారు. ఇళ్ల నిర్మాణం ప్రగతిపై అధికారులు వివరాలు అందించారు. ఇప్పటివరకూ 4,24,220 ఇళ్లు పూర్తయ్యాయని, ఆగస్టు 1 నాటికి 5 లక్షల ఇళ్లు పూర్తవుతాయని అధికారులు వెల్లడించారు. ఈ సమావేశానికి మంత్రి జోగి రమేష్, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## జులై 19న అఖిల పక్ష సమావేశం : కేంద్రం



న్యూఢిల్లీ : పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో... జులై 19న అఖిల పక్ష సమావేశానికి కేంద్రం గురువారం పిలుపునిచ్చింది. ఈ నెల 20న ప్రారంభం కానున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఆగస్ట్ 11 వరకు కొనసాగనున్నాయి. పార్లమెంట్ వ్యవహారాల కొనసాగించడంతో పాటు ఇతర చర్చల్లో అన్ని పార్టీలు సహకారం అందించాలని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి ట్విట్ చేశారు. 23 రోజుల పాటు సాగే సెషన్‌లో మొత్తం 17 సభలు ఉంటాయని పేర్కొన్నారు. ''సెషన్‌లో పార్లమెంట్ , ఇతర వ్యవహారాలకు సహకరించాలని అన్ని పార్టీలకు విజ్ఞప్తి చేస్తున్నాను'' అని కేంద్ర మంత్రి తెలిపారు. వర్షాకాల సమావేశాలు పాత పార్లమెంట్ భవనంలోనే నిర్వహించనున్నట్లు కేంద్రమంత్రి మీనాక్షి లేఖి సోమవారం ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రతిపక్షాలు కూడా పలు సమస్యలపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసేందుకు సిద్ధమయ్యాయి.

## తెలుగు రాష్ట్రాల హైకోర్టులకు ప్రధాన న్యాయమూర్తులు ఖరారు



అమరావతి: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ హైకోర్టులకు కొత్త జడ్జీలను సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసింది. ఈ మేరకు ఏపీ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా ధీరజ్ సింగ్ ఠాకూర్, తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా అలోక్ ఆరాధేలను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని కొలీజియం నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత హైకోర్టు సీజే జస్టిస్ పీకే మిశ్రా మే నెలలో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులు కానున్నారు. ఈ క్రమంలో బాంబే హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌ను ఏపీ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరాధేను తెలంగాణ హైకోర్టుకు ప్రధాన న్యాయమూర్తిగా నియమించాలని కొలీజియం సూచించింది. 2013లో జమ్మూ-కాశ్మీర్ హైకోర్టు కు న్యాయమూర్తిగా పనిచేసిన జస్టిస్ ధీరజ్ సింగ్... 2022 నుంచి బాంబే హైకోర్టులో న్యాయమూర్తిగా పనిచేస్తున్నారు. గత సంవత్సరం ఈయనను మణిపూర్ హైకోర్టుకు కొలీజియం సిఫార్సు చేసింది. కానీ కేంద్ర ప్రభుత్వం తేల్చకపోవడంతో దానిని రద్దు చేశారు. మధ్యప్రదేశ్‌కు చెందిన జస్టిస్ అలోక్ 2009 డిసెంబరులో అదే రాష్ట్ర హైకోర్టుకు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2018 నుంచి కర్ణాటక హైకోర్టులో న్యాయమూర్తిగా పనిచేస్తున్నారు. తెలంగాణ, ఏపీలతో సహా.. 7 రాష్ట్రాల హైకోర్టులకు కొత్త చీఫ్ జస్టిస్‌లు రానున్నారు.

## జూలై 14న చంద్రయాన్-3 ప్రయోగం



శ్రీహరికోట: చంద్రయాన్-3 స్పేస్‌క్రాఫ్ట్‌ను ఈనెల 14వ తేదీన ప్రయోగించనున్నారు. శ్రీహరి కోటలో సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ లాంచింగ్ ప్యాడ్ నుంచి మధ్యాహ్నం 2.35 నిమిషాలకు రాకెట్ నింగిలోకి ఎగరనున్నది. ఈ విషయాన్ని ఇవాళ ఇస్రో వర్గాలు వెల్లడించాయి. వాస్తవానికి చంద్రయాన్3 మిషన్‌ను ఈనెల 13వ తేదీన ప్రయోగించనున్నట్లు ఇటీవల ఇస్రో చెప్పిన విషయం తెలిసిందే. అయితే ఒక రోజు తేడాతో ఈ ప్రయోగాన్ని చేపట్టనున్నారు. ల్యాంచింగ్ ప్యాడ్ వద్దకు రాకెట్ చేరుకున్నది. ఆ ప్రయోగం కోసం పనులు వేగవంతం చేశారు. చంద్రయాన్ పేలోడ్ ఉన్న క్యాప్సూల్‌ను .. జీఎస్ఎల్వీ రాకెట్‌తో రెండు రోజుల క్రితమే అనుసంధానం చేశారు. సతీశ్ ధావన్ సెంటర్ వద్ద ఎల్వీఎం-3తో చంద్రయాన్ క్యాప్సూల్‌ను జత చేసినట్లు ఇస్రో తెలిపింది. దీంతో దాదాపు చంద్రయాన్-3 కీలక పనులన్నీ ముగిశాయి. చంద్రయాన్-3 స్పేస్‌క్రాఫ్ట్ సుమారు 3900 కేజీల బరువు ఉంటుంది. తొలుత యూఆర్ రావు శాటిలైట్ సెంటర్‌లో పేలోడ్ క్యాప్సూల్ తయారు చేశారు. ఆ తర్వాత దాన్ని ప్రత్యేక వాహనంలో సతీశ్ ధావన్ సెంటర్‌కు తరలించారు. అక్కడ రాకెట్‌తో పేలోడ్‌ను అనుసంధానం చేశారు. అన్నీ అనుకూలిస్తే 13వ తేదీన.. లేదంటే 19వ తేదీలోగా చంద్రయాన్3ని ప్రయోగించనున్నట్లు ఇటీవల ఇస్రో చైర్మెన్ సోమనాథ్ పేర్కొన్న విషయం తెలిసిందే. రాకెట్ పైభాగంలో ఉన్న పేలోడ్‌లో ల్యాండర్, రోవర్ ఉంటాయి. దాంట్లో ఉన్న ప్రొపల్షన్ మాడ్యూల్ వల్ల చంద్రుడికి సుమారు 100 కిలోమీటర్ల దూరం వరకు స్పేస్‌క్రాఫ్ట్ వెళ్తుంది. నిర్దేశిత ప్రదేశంలో ల్యాండర్ సురక్షితంగా దిగుతుందని, ఆ తర్వాత రోవర్ అక్కడ రసాయనక విశ్లేషణ చేపడుతుందని ఇస్రో అధికారులు తెలిపారు.

## బిజెపి యేతర ప్రభుత్వాలను టార్గెట్ చేసేందుకే యుసిసి: స్టాలిన్



చెన్నై : బిజెపి యేతర ప్రభుత్వాలను టార్గెట్ చేసేందుకే ప్రధాని యుసిసి ప్రతిపాదనను తీసుకువచ్చారని డిఎంకె అధ్యక్షుడు, తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ విరుచుకుపడ్డారు. కేవలం బిజెపి నేతృత్వంలోని కేంద్రాన్ని వ్యతిరేకించిన వారిని లక్ష్యంగా చేసుకునేందుకే యుసిసి అమలును సులభతరం చేసే ప్రతిపాదిత చర్యను తెరపైకి తీసుకువచ్చిందని మండిపడ్డారు. ఎన్నికల వాగ్దానాలను నెరవేర్చేందుకు కాషాయ పార్టీ ముందుకు రాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపిది ప్రజా వ్యతిరేక వైఖరితో బిజెపి ప్రజలపై మతం, సనాతనం పేరుతో ఆంక్షలు విధిస్తోందని మండిపడ్డారు. ఇవి నిరంకుశ పాలక చర్యలని అన్నారు. యుసిసి ప్రతిపాదనను ప్రస్తావిస్తూ.. దేశంలో ఇప్పటికే సివిల్, క్రిమినల్ చట్టాలు ఉన్నాయని, వ్యక్తిగత చట్టాలను రద్దు చేసేందుకు కేంద్రం యుసిసిని ప్రవేశపెట్టేందుకు యత్నిస్తోందని అన్నారు. కాషాయ పార్టీని, దాని సిద్ధాంతాన్ని, కేంద్రంలో దాని పాలనను వ్యతిరేకించే ప్రభుత్వాలను లక్ష్యంగా చేసుకోవడం, ప్రజలను ఇబ్బందుల పాలు చేయడమే వారి ఎత్తుగడ అని ఆగ్రహం వ్యక్తంచేశారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాని విజయం సాధించేందుకు మత విద్వేషాలను రెచ్చగొట్టడంతో పాటు దేశంలో గందరగోళం సృష్టించేందుకు యత్నిస్తున్నారని గతంలో స్టాలిన్ విమర్శించిన సంగతి తెలిసిందే.

## 8 తీర్మానాలు ఆమోదించిన ఎన్సీపీ వర్కింగ్ కమిటీ..

### ప్రఫుల్ పటేల్‌తో సహా తిరుగుబాటు నేతల బహిష్కరణ




న్యూఢిల్లీ: నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ)లో సంక్షోభం , తిరుగుబాటును ఆ పార్టీ చీఫ్ శరద్ పవార్ సీరియస్‌గా పరిగణించారు. ఆయన అధ్యక్షతన గురువారం ఢిల్లీలో జరిగిన జాతీయ సమావేశంలో కఠిన చర్యలు చేపట్టారు. ఎన్సీపీ వర్కింగ్ కమిటీ 8 తీర్మానాలను ఆమోదించింది. అజిత్ పవార్ తిరుగుబాటుకు సహకరించిన ప్రఫుల్ పటేల్, సునీల్ టట్కరే, మరో 9 మంది ఎమ్మెల్యేలను పార్టీ నుంచి బహిష్కరించింది. ఎన్సీపీ వర్కింగ్ కమిటీ ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు ఆ పార్టీ నేత పీసీ చాకో తెలిపారు. తిరుగుబాటు నేత అజిత్ పవార్ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు ఆ వర్గం చేసిన వాదనను ఆయన తోసిపుచ్చారు. అలాంటి వాదనలకు పసలేదన్నారు. 27 రాష్ట్ర యూనిట్ల నేతలంతా శరద్ పవార్‌కు మద్దతుగా ఈ సమావేశానికి హాజరైనట్లు వెల్లడించారు.కాగా, గురువారం ఢిల్లీలో ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్ అధ్యక్షతన ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశం జరిగింది. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్సీపీ అధ్యక్షుడ్ని తానేనని అన్నారు. ఎన్సీపీ అధ్యక్షుడిగా ఎవరన్నా చెప్పుకుంటే అది పూర్తిగా తప్పని అన్నారు. అందులో ఎలాంటి నిజం లేదని చెప్పారు. అజిత్ పవర్ స్టేట్‌మెంట్‌కు ఎలాంటి ప్రాముఖ్యత లేదన్నారు.మరోవైపు శరద్ పవర్ నేతృత్వంలో జరిగిన జాతీయ కార్యవర్గ సమావేశం, అందులో చేసిన తీర్మానాలకు ఎలాంటి చట్టబద్ధత లేదని అజిత్ పవర్ వర్గం తెలిపింది. ఎన్సీపీ వివాదం ప్రస్తుతం ఎన్నికల సంఘం పరిధిలో ఉన్నట్లు పేర్కొంది.

## ఏపీలో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తా..

### ఢిల్లీలో జేపీ నడ్డాను కలిసిన పురంధేశ్వరి



ఢిల్లీ: ఏపీ బీజేపీ నూతన అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాను కలిశారు. గురువారం ఢిల్లీ వెళ్లిన ఆమె నడ్డా నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఏపీలో రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతంపై సుమారు 45 నిమిషాల పాటు చర్చించారు. అనంతరం తన పై నమ్మకం ఉంచినందుకు నడ్డాకి కృతజ్ఞతలు తెలియజేశానంటూ ట్వీట్ చేశారు. అలాగే ఏపీలో బీజేపీ బలోపేతం కోసం కృషి చేస్తానని ట్విట్టర్‌లో పేర్కొన్నారు. 'ఢిల్లీలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాను కలిశాను. నాపై ఉంచిన నమ్మకానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశాను. నిబద్ధతో పనిచేసి ఏపీలో బీజేపీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తాను. ఏపీ, ఆంధ్రుల హక్కులు కాపాడేందుకు కృషి చేస్తాను' అని ట్విట్టర్‌లో పేర్కొన్నారు పురంధేశ్వరి. కాగా సోము వీర్రాజు స్థానంలో ఏపీ బీజేపీ అధ్యక్షురాలిగా పురంధేశ్వరి నియమిస్తూ బీజేపీ అధిష్టానం మంగళవారం (జూన్ 4) నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే.కాగా ఏపీలో గత మూడేళ్లుగా సోము వీర్రాజు ఏపీ బీజేపీ చీఫ్‌గా ఉన్నారు. అయితే ఆయనపై పలు ఫిర్యాదులు వచ్చాయి. ముఖ్యంగా వైసీపీ ప్రభుత్వంపై దూకుడుగా వ్యవహరించడం లేదన్న ఆరోపణలు వచ్చాయి. అలాగే వీర్రాజు హయాంలోనే కన్నా లక్ష్మీ నారాయణ వంటి కీలక నాయకులు పార్టీని వీడారు. ఈక్రమంలోనే సోము వీర్రాజు స్థానంలో పురంధేశ్వరని బీజేపీ అధ్యక్షురాలిగా నియమించింది బీజేపీ అధిష్ఠానం.

# ప్రజలకు సత్వరం మేలు చేసే అద్భుత కార్యక్రమం జగనన్న సురక్ష..

**పేదల సంక్షేమమే మా ప్రభుత్వ లక్ష్యం..**
**నరసరావుపేట శాసనసభ్యులు డా. గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి**







నరసరావుపేట .జూలై 6 (ప్రజా పాలన ప్రతినిధి): ప్రజలకు సత్వరం మేలు చేసే అద్భుత కార్యక్రమం జగనన్న సురక్ష అని పేదల సంక్షేమమే మా ప్రభుత్వ లక్ష్యమని నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. 28వ వార్డులోనే సంక్షేమ పథకాల ద్వారా 3.32 కోట్ల రూపాయలు వార్డ్ అభివృద్ధి కొరకు 25 లక్షలతో చేసాం. 12వ వార్డులోనే సంక్షేమ పథకాల ద్వారా 11.10 కోట్ల రూపాయలు, సీసీ రోడ్లు డ్రైనేజీలు, నాడుబినేడు ద్వారా తిలక్ స్కూల్ అదునపు తరగతి గదులు నిర్మాణం మరియు అభివృద్ధి కొరకు 1.25 కోట్లు, 214 మంది లబ్ధిదారులకు స్థలం కేటాయించగా, గడపబిగడపకు కార్యక్రమం ద్వారా 20 లక్ష రూపాయలుతో అభివృద్ధి. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరించారు. ఈ సందర్భంగా -నరసరావుపేట గౌరవ శాసనసభ్యులు డా.గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి పేదవాడికి సంక్షేమం, ప్రభుత్వ పాలనను చేరువ చేసేందుకు జగనన్న సురక్ష కార్యక్రమానికి సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారని గౌరవ శాసనసభ్యులు డా. గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. నరసరావుపేట పట్టణంలోని స్థానిక 28వ వార్డు అనగా పాతూరు సచివాలయం మరియు 12వ వార్డు అనగా షాలింనగర్ సచివాలయం నందు నిర్వహించిన జగనన్న సురక్ష . ప్రజలనుద్దేశించి ప్రసంగించారు జగనన్న సురక్ష కార్యక్రమం ప్రతి ఒక్కరూ తెలుసుకోవలసిన అవసరం ఉందని డా. గోపిరెడ్డి అన్నారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేక సంక్షేమ పథకాలు అందని వారికి లబ్ధి చేకూర్చేందుకు గౌరవ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టారని తెలిపారు. ప్రతి వార్డు / గ్రామంలో సురక్ష సభలు ఏర్పాటు చేసి ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించటం జరుగుతోంది అన్నారు. ప్రభుత్వం తరపున 11 రకాల ధ్రువీకరణ పత్రాలు పూర్తి ఉచితంగా అందజేయడం జరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, వివిధ వార్డు ఇన్చార్జిలు, ప్రభుత్వ అధికారులు మున్సిపల్ కమిషనర్ గారు మరియు మున్సిపల్ ఇంజనీర్ గారు మరియు మున్సిపల్ ఆర్ వో గారు, పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, ప్రముఖులు, పార్టీ నాయకులు , కార్యకర్తలు సచివాలయ సిబ్బంది మరియు వాలంటరీలు, పెద్ద ఎత్తున ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# జూలై 8న ప్రధాన మంత్రిచే కాజీపేటలో శంకుస్థాపన కానున్న రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్

**రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ గురించి మీడియాకు వివరించిన దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్**



హైదరాబాద్: దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ 06 జులై 2023న కాజీపేటలోని శంకుస్థాపనకానున్న రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ స్థలాన్ని సందర్శించిన తరువాత పత్రిక సమావేశమును ఏర్పాటు చేసి ప్రాజెక్ట్ వివరాలను సవివరముగా వివరించినారు. ఈ సమావేశంలో సికింద్రాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ ఏ కె గుప్తా , రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ వీఎన్ఎల్) చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీ మున్నా కుమార్ మరియు ఇతర అధికారులు కూడా పాల్గొన్నారు. అరుణ్ కుమార్ జైన్ సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగిసూ్త కాజీపేటలోని రైల్వే తయారీ యూనిట్ ,భారత రైల్వేలకే కాకుండా తెలంగాణ రాష్ట్ర ప్రజలకు కూడా ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్ట్ అని తెలియజేశారు. ఈ యూనిట్ తెలంగాణలో ఏర్పాటవుతున్న తొలి భారతీయ రైల్వే తయారీయూనిట్ అని మరియు ఈ ప్రాంత సమగ్రాభివృద్ధికి దోహదపడుతుందని చెప్పారు. అవసరాలకు అనుగుణంగా వివిధ రకాల రోలింగ్ స్టాక్‌లను ఉత్పత్తి చేస్తుందని ఆయన తెలియజేశారు. కాజీపేటలోని రైల్వే తయారీ యూనిట్ తెలంగాణ రాష్ట్రంలోని హనుమకొండ ప్రాంతంలో కొత్త పారిశ్రామిక అభివృద్ధికి పర్యావరణ వ్యవస్థను ప్రోత్సహిస్తు ప్రజల సామాజిక-ఆర్థిక పురోగతిలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని ఆయన వివరించారు .తొలుత కాజీపేటలో నెలకు 200 వ్యాగన్‌ల పీరియాడిక్ ఓవర్‌హాలింగ్ (పి ఓఎచ్) చేపట్టేందుకు వ్యాగన్ రిపేర్ వర్క్ షాప్ మంజూరు చేయబడింది. ఈ ప్రాజెక్టు రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ వీఎన్ఎల్)కు అప్పగించబడింది. ఆ తర్వాత, రైల్వే వ్యాగన్ల అవసరాలు పెరగడం, స్థానిక పరిశ్రమను ప్రోత్సహించడానికి, మరియు ఇతర విన్నపాలు అనేక అంశాలను పరిగణనలోకి తీసుకుని కాజీపేటలోని 'వ్యాగన్ రిపేర్ షాప్'ను రూ సుమారు 521 కోట్లు అంచనా వ్యయంతో 'రైల్వే తయారీ యూనిట్'గా అభివృద్ధి చేయడము జరుగుతుంది. మన గౌరవనీయులైన ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోడీగారిచే ప్రారంభించబడిన ' ఆత్మనిర్భర్ భారత్' కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లడంలో కాజీపేటలోని రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ నిర్మాణం మరొక ప్రధానమైన అడుగు. ఈ తయారీ యూనిట్‌తో సంవత్సరానికి 1,200 వ్యాగన్‌లను తయారు చేయగల సామర్థ్యంతో ప్రారంభించబడుతుంది. రెండవ సంవత్సరం నుండి, సంవత్సరానికి 2,400 వ్యాగన్లను తయారుచేయగలుగుతుంది. వ్యాగన్‌ల లభ్యతను మెరుగుపరచడం ద్వారా తయారీ యూనిట్ పరిశ్రమను ప్రోత్సహిస్తుంది. అదనంగా, రోలింగ్ స్టాక్ ఉత్పత్తి పెరగడం రాష్ట్ర ఆర్థిక వృద్ధిని మాత్రమే కాకుండా, దేశమంతటా కీలకమైన మరియు చాలా అవసరమైన భారీ వస్తువులను రవాణా చేయడం ద్వారా భారతదేశ ఆర్థిక వ్యవస్థను కూడా పెంచుతుంది.



# బాబూ జగజ్జీవన్ రామ్ ఆశయాల సాధనకు కృషి చేస్తా: వైసిపి చీరాల ఇన్చార్జి కరణం వెంకటేష్



చీరాల,జూలై 06, ప్రజాపాలన : అట్టడుగువర్గాల ఆశాజ్యోతి, సంఘసంస్కర్త, స్వాతంత్ర్య సమరయోధులు, సుదీర్ఘకాలం పాటు కేంద్రమంత్రిగా పని చేసి, ఎన్నో సంస్కరణలు ప్రవేశపెట్టిన, మహోన్నత వ్యక్తి భారత మాజీ ఉపప్రధాని డాక్టర్ బాబూ జగజ్జీవన్ రామ్ అని, వైఎస్సా ర్ సిపి చీరాల నియో జకవర్గ ఇన్చార్జి కరణం వెంకటే ష్ బాబు అన్నారు. బాబూ జగజ్జీవన్ రామ్ 37వ వర్ధంతి సందర్భంగా, స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహ ఆవరణలో, బాబూ జగజ్జీవన్ రామ్ చిత్రపటానికి, వైఎస్ఆర్సిపి చీరాల ఇన్చార్జి కరణం వెంకటేష్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వైసీపీ ఇంచార్జ్ వెంకటేష్ మాట్లాడుతూ, బాబూ జగజ్జీ వన్ రామ్ ఆశయాల సాధనకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో అర్బన్ ఫైనాన్స్ డైరెక్టర్ గవి ని శ్రీనివాసరావు, పి.ఎ.సి.ఎస్. అధ్యక్షులు బోయిన కేశవులు, కీర్తి వెంకట్రావు, బత్తుల అనిల్, కోలా శివ, డాక్టర్ తాడివలస దేవరాజు,బుర్ల సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ హయాంలో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ: చీరాల ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణమూర్తి



చీరాల, జూలై 06, ప్రజాపాలన : విద్యకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చే ప్రాధాన్యత ప్రశంస నీయమని, వైసిపి ప్రభుత్వ హయాం లో, ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ పట్టిం దని, ఇది ఎంతో శుభ పరిణా మ మని, చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి హర్షం వ్యక్తం చేశారు. చీరాల మండలం వాడరేవు గ్రామంలో, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో, జరిగిన 4వ విడత జగనన్న అమ్మ ఒడి కార్యక్రమం లో భాగంగా, చీరాల మండలం లో,18 కోట్ల 74లక్షల రూపాయ లను, 12490 మంది లబ్ధిదారు లైన, తల్లుల ఖాతాలలో జమ చేశారని, ఎమ్మెల్యే కరణం.బలరామ కృష్ణమూర్తి తెలిపారు. ముఖ్యమంత్రి నాడు-నేడు కింద గవర్నమెంట్ స్కూల్స్ ని, ప్రైవేట్ కార్పొరేట్ స్కూల్స్ కు దీటుగా, అత్యంత సుందరంగా తీర్చిదిద్దడం జరిగిందని, ఇంకా మౌలిక సదుపాయాల రూపక ల్పన చేపడతామన్నారు. స్కూ ల్లో పిల్లలకు, స్వయంగా ఎమ్మె ల్యే భోజనం వడ్డించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈ.ఓ. శ్రీని వాసరావు, ఎంపీడీఓ నేతాజీ, ఎం.ఇ.ఓ -1 సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఎం ఇ ఓ.- 2 సుధా రాణి, అర్బన్ ఫైనాన్స్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, ఆర్ బి కె చైర్మన్ కావూరి రమణా రెడ్డి, మాజీ సర్పంచ్ ఎరిపిల్లి రమణ, అక్కల శ్రీనివాసరెడ్డి, పిక్కి నారాయణ, గడ్డం శ్రీను, ప్రేమ్ చంద్, రామి రెడ్డి, రాజ బాబు, సుబ్బారావు, నర్రా బ్రహ్మయ్య, చావలి వాసు, గాలి, నాదెండ్ల కోటేశ్వరరావు, బుర్ల సాంబశివ రావు,బుర్ల మురళి, తదితర నాయకులు పాల్గొన్నారు.

# డాక్టర్ బాబూ జగజ్జీవన్ రామ్‌కు ఘన నివాళి



చీరాల, జూలై 06, ప్రజాపాలన : డాక్టర్ బాబూ జగజ్జీవన్ రామ్ 37వ వర్ధంతి సందర్భంగా, చీరాల ముక్కోణం పార్క్ సెంటర్లోని, డాక్టర్ బాబూ జగజ్జీ వన్ రామ్ విగ్రహానికి, చీరాల బాబు జగ్జీవన్ రావ్ విగ్రహ నిర్మాణకమిటీ, మాదిగ రిజర్వేషన్ పోరాటసమితి, మహాజన సోష లిస్టు పార్టీ, మాదిగ విద్యార్థి సమాఖ్య , మాదిగ ఉద్యోగుల సమాఖ్య ల సంయుక్త ఆధ్వర్యంలో, బాబూ జగజ్జీవన్ రామ్ వర్ధంతి వేడుక లను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షులు బుడం గుంట్ల. లక్ష్మీ నరసయ్య మాదిగ మాట్లాడుతూ, బాబూ జగ్జీవన్ రామ్ తన విద్యార్థి దశ నుండే, అంటరానితనాన్ని వ్యతిరేకించి న మహోన్నత వ్యక్తి జగ్జీవన్ రామ్ అని అన్నారు. అంటరాని తనం పేరిట, పిల్లలు తాగటానికి, స్కూల్లో వేర్వేరుగా ఏర్పా టు చేసిన, మూడు కుండలను చూసిన బాబు జగ్జీవన్ రామ్, మూడు కుండలను పగల గొట్టి, స్కూల్లో ఒకే కుండ పెట్టే విధం గా, విద్యార్థి దశలోనే ఉద్యమించారన్నారు. అంతేకాకుండా భారతదేశంలో అస్పృశ్యత పోవాలంటే, అత్యున్నత చదువులు చదువుకోవాలని, తద్వారానే దళితులకు విముక్తి లభిస్తుందనే నినాదంతో, ఆయన ఎంతో ఉన్నతమైన చ దువులు చదివి, రాజకీయంగా అత్యధిక కాలం పార్లమెంటేరి యన్ గా ఉండి, ఉత్తమ పార్ల మెంటేరియన్ గా భారతదేశ లోక్ సభలో అనేకమైన మంత్రి పదవులను అలంకరించిన మహోన్నత వ్యక్తి బాబూ జగ్జీవన్ రామ్ అని అన్నారు. తొలుత జగజ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులు అర్పిం చారు. కార్యక్రమంలో ఎం ఎస్ పి బాపట్ల జిల్లా అధ్యక్షులు బుడంగుంట్ల లక్ష్మీనరసయ్య మాదిగ, జిలకర రమేష్, ఉసురు పాటి సురేష్, దుడ్డు సైమం, వీరమల్లు కోటేశ్వర రావు, దుడ్డు వందనం, ఎంఈ ఎఫ్ నాయకులు దుడ్డు వెంక టేశ్వర్లు, కొమ్మూరు లైమ్, ఎం ఆర్పిఎస్ నాయకులు తేళ్ల అవినాష్, దుడ్డు రాంబాబు, అప్పా రావు తదితరులు పాల్గొన్నారు.

# మత్స్యకారులకు అండగా ఉంటాం: ఎమ్మెల్యే బలరామ్, వైసిపి ఇన్చార్జి వెంకటేష్




చీరాల,జూలై 06, ప్రజాపాలన : మత్స్యకార ప్రాంత సమస్యల ను పరిష్కరించడమే కాకుండా, ఎల్లవేళలా మత్స్య కారులకు అండగా ఉంటామని, చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైసీపీ ఇన్చార్జి కరణం వెంకటేష్ లు స్పష్టం చేశారు. చీరాల మండలం, గవినివారి పాలెం పంచాయతీ పరిధిలోని, విజయలక్ష్మీపురం గ్రామంలో, ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన పథకం, 40శాతం సబ్సిడీ కింద మంజూ రైన రెండు బోట్లు, ఇన్సులేటేడ్ వాహనంను, ఎమ్మెల్యే కరణం బలరామ్, వైసిపి ఇంచార్జ్ కరణం వెంకటేష్ ల చేతుల మీదుగా ప్రారంభించా రు. ఈ సందర్భంగా మత్స్యకారులు మాట్లాడుతూ, లైట్స్,గ్రావెల్ రోడ్డు కావాలని కోరగా, ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి, వాటిని త్వరత గతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఫిషరీస్ ఏ.డి. కృష్ణకిషోర్, ఎఫ్‌డిఒ.రాజ్ కుమార్, విఎఫ్ఎ. వెంకట్రావు సంఘమిత్ర అధికారి రవికుమార్, అర్బన్ ఫైనాన్స్ డైరెక్టర్ గవిని శ్రీని వాసరావు, ఆర్బీకే చైర్మన్ కావూరి రమణారెడ్డి, కాపులు కాటంగారి శ్రీనివాసరావు, పి. భద్రాచలం,మత్స్యకారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# ప్రవేటు స్కూల్ బస్సుల్లో విద్యార్థులకేది భద్రత

## ప్రమాదపు అంచున ప్రయాణం
## ఇప్పటికీ పూర్తికానీ ఫిట్ నెస్ సర్టిఫికెట్లు
## ప్రవేటు విద్యాసంస్థలపై చర్యలేవి

**ఒక ప్రమాదం జరిగి కొంతమంది చనిపోయిన తర్వాత ఆ ప్రమాదానికి కారణాలు వెతకటం, బాధ్యులు పై చర్యలు తీసుకోవడం సహజంగా జరుగుతుంది. ప్రభుత్వం గానీ, అధికారులు గానీ ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.**





పల్నాడు జిల్లా. బ్యూరో. నరసరావుపేట .జూలై 6 (ప్రజా పాలన ప్రతినిధి) చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా తయారయింది ప్రభుత్వ విధానాలు చూస్తుంటే.. ఇటీవల ఘోర రైలు ప్రమాద ఘటన చూశాం. అలాగే పల్నాడు జిల్లా నరసరావుపేట లో ప్రైవేటు విద్యా సంస్థ ఆక్స్ ఫర్డ్ స్కూల్ బస్ బోల్తా పడ్డ సంఘటన చూసాం. త్రుటిలో తప్పిన ప్రమాదం కారణంగా ప్రాణహాని జరగక పోవడం కొంత ఊరకనిచ్చిన ప్రైవేటు స్కూల్ బస్సులలో విద్యార్థులకు భద్రత ఉందా అనే సందేహం కలుగుతుంది. తల్లిదండ్రులు ఆందోళన గురవుతున్నారు. విద్యను వ్యాపారం చేసి అధిక ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థలు విద్యార్థులకు రక్షణ కల్పించలేకపోతున్నారు. విద్యార్థులను ఇంటి నుంచి పాఠశాలకు తరలించే ఇవి ఫిట్‌లెస్‌గా మారుతున్నాయి. వాహనాల కండీషన్ను పరీక్షించి ఎప్పటికప్పుడు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకోవాల్సిన స్కూల్ యాజమాన్యాలు పట్టించుకోవడం లేదు. బస్సుల సామర్థ్యాన్ని పరిశీ లించాల్సిన సంబంధిత శాఖ అధికారులు సైతం ఆ దిశగా దృష్టి సారించడం లేదనే విమర్శలున్నాయి. ఫలితంగా కాలం చెల్లిన బస్సులను నడుపుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. మరోవైపు పాఠశాలలు ప్రారంభమై రెండు నెలలు గడిచినప్పటికీ ప్రవేట్ విద్యాసంస్థల స్కూల్ బస్సులు పూర్తిస్థాయిలో ఫిట్ నెస్ సర్టిఫికెట్లు తీసుకోలేదు. పల్నాడు జిల్లాలో అనుమతులు ఉన్నాయి 800 కూల్ బస్సులు ఉండగా అందులో ఇప్పటికీ 720 బస్ లకు మాత్రమే ఫిట్నెస్ సర్టిఫికెట్లు తీసుకున్నారు. ప్రతి సంవత్సరం మే నెల నుంచి స్కూల్ బస్సులకు ఫిట్నెస్ సర్టిఫికెట్ల కార్యక్రమం ప్రారంభమవుతుంది. ఈ నేపథ్యంలో బడి బస్సు భద్రతపై సర్వత్రా అనుమానం వ్యక్తమవుతోంది.

### తల్లిదండ్రుల్లో ఆందోళన

ఆక్స్ఫర్డ్ స్కూల్ బస్సు ప్రమాదానికి గురైన సంఘటనతో బస్సు భద్రతపై విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. బస్సులో సీట్లు, అద్దాలు, టైర్లు, తదితర సామగ్రి అన్ని సక్రమంగా ఉన్నాయా.. లేదా.? అనేది చూసుకోవాలని రవాణా శాఖ అధికారులు సూచిస్తున్నారు. స్కూల్ బస్సులకు సంబంధించి 32 అంశాలతో కూడిన నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. ఇందులో ప్రధానంగా ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్ తప్పనిసరి. అలాగే డ్రైవర్ వయసు 60 ఏళ్లకు మించొద్దు. బస్సులో విద్యార్థుల వివరాల పట్టిక నమోదు చేసి ఉంచాలి. అలాగే వాహనాలను 15 ఏళ్లు మించి నడపరాదు. ఈ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాల్సిన బాధ్యత ఆయా పాఠశాలల యాజమాన్యాలపై ఉంది. అయితే జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా చాలా పాఠశాలలు కండీషన్ లేని బస్సుల్లో విద్యార్థులను తరలిస్తున్నారు. దీంతో అప్పుడప్పుడు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రవాణా శాఖ అధికారులు ఏటా పాఠశాలల పునఃప్రారంభం తర్వాత కేవలం వారం పాటు తనిఖీలు నిర్వహించి వదిలి పెట్టడంతో ఆయా పాఠశాలల యాజమాన్యాలు దీనిని పెద్దగా పట్టించుకోవడం లేదని తెలుస్తోంది.

### ఫిట్‌నెస్ తప్పనిసరి

ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలు స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌ను బడులు తెరవ ముందే చేయించుకోవాలి ఆర్టీవో కె టి.పరందామ రెడ్డి తెలిపారు. నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని అన్నారు. ఫిట్‌నెస్ లేకుండా బస్సు రోడ్డు ఎక్కితే సీజ్ చేస్తాంమని అన్నారు. విద్యార్థులు అసౌకర్యానికి గురికాకుండా బస్సులో అన్ని సౌకర్యాలు కల్పించాలి. నిబంధనలకు సంబంధించి డ్రైవర్లు, యాజమాన్యాలకు శిక్షణ నిర్వహిస్తామని, సేఫ్టీ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తామని అన్నారు.

## అర్ట్స్ కళాశాల డైరెక్టర్ దిష్టిబొమ్మ దహనం



ప్రజాపాలన ప్రతినిధి: వార్డెన్ల ఇన్చార్జిల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న డైరెక్టర్ దిష్టిబొమ్మ దహనం డెమోక్రటిక్ స్టూడెంట్ ఫెడరేషన్ డిఎస్ఎఫ్ ఆధ్వర్యంలో అర్ట్స్ కళాశాల రోడ్డు మీద డైరెక్టర్ దిష్టిబొమ్మ దహనం చేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డిఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు రాజు జిల్లా ఉపాధ్యక్షుడు ధనాపురం ఉదయ్ మాట్లాడుతూ.... రాష్ట్రంలో ఒక హాస్టల్ నుండి మరొక హాస్టల్ కు ఇన్చార్జులు ఇస్తున్నారు. డబ్బులు ఇస్తే ఎవరికి ఇవ్వాలి అన్న పరిస్థితి మన రాష్ట్రంలో ఏర్పడింది విద్యార్థుల మీద లేని శ్రద్ధ ఇంచార్జిలు ఇచ్చే ముడుపుల మీద ఉండటం గమనార్హం ఇంత జరుగుతున్నా కూడా డైరెక్టర్ సార్ ఎందుకు మౌనంగా ఉన్నారు. అని మేము ప్రశ్నిస్తున్నాము ఒక హాస్టల్ నుండి మరో హాస్టల్ కు 30 కిలోమీటర్లు ఉన్నవాళ్లకు ఇన్చార్జిలు ఇవ్వాలి అది కాకుండా ఏకంగా ఇష్టం వచ్చిన వాళ్ళకి 50 కిలోమీటర్ల నుండి 100 కిలోమీటర్ల వరకు డిస్టెన్స్ ఉన్నా కూడా ఇన్చార్జిలను ఇస్తున్నారు. రాష్ట్రంలో ఇంత జరుగుతున్నా కూడా డైరెక్టర్ సార్ కేవలం తన సీటుకే పరిమితం కాకుండా ఏ జిల్లాలో జరుగుతున్నాయి ఇలాంటివి అని పరిశీలన చేయాలి ఆ విధంగా చేయలేకపోవడం వల్ల హాస్టల్ విద్యార్థులు నష్టపోయే ప్రమాదం ఉంది అన్నం పెడుతున్నారా లేదా అని తెలియదు విద్యార్థులకు ఆరోగ్యం బాగా లేకుండా పట్టించుకునే వాళ్ళు లేకపోతున్నారు.ఎందుకంటే దాదాపు 50 కిలోమీటర్ల నుండి 100 కిలోమీటర్లు దూరం వచ్చేలోపు ఆ విద్యార్థులకు ఏమైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన డైరెక్టర్ సార్ ఒక్క సారి రండి ఇన్చార్జ్ లు ఎందుకు అని మేము అడుగుతున్నాం ఇప్పటికైనా ఈ సమస్యపై డైరెక్టర్ సార్ గారు స్పందించి డిస్టెన్స్ విషయంలో తగిన న్యాయం చేయాలని కోరుతున్నాము లేని విడలా రానున్న రోజుల్లో ఇంకా పై ఎత్తు పై ఉద్యమాలు చేస్తామని తెలియజేస్తూన్నాము కార్యక్రమాలు dSF నాయకులు ఉదయ్ ప్రదీప్ డివిజన్ అధ్యక్షుడు హరికృష్ణ డివిజన్ ఉపాధ్యక్షుడు సురేష్ బాబు రమణ వీర శ్రీ కృష్ణ గౌతమ్ తదితరులు పాల్గొన్నారు

## రాజుపాలెం మండల ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆరోగ్య పరీక్షలు




రాజుపాలెం మండలం ప్రజా పాలన ప్రతినిధి: కొండమోడు పరిధి లోని వీరమ్మ కాలనీలో దీనమ్మ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ నిర్వహణలో నిర్వహిస్తున్న అనాధ పిల్లల వృద్ధుల ఆశ్రమంలో ఉన్న చిన్నారులకు వృద్ధులకు మండల వైద్యాధికారి డాక్టర్ వి కృష్ణకుమార్ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణకుమార్ మాట్లాడుతూ ఆశ్రమంలో ఉన్న చిన్నారులు ఒకరి దుస్తులు ఒకరు ధరించకూడదని తడి దుస్తులను కూడా వేసుకోకూడదు అని ప్రతిరోజు ఉదయము సాయంత్రం రెండు పూటలు స్నానం తప్పనిసరిగా చేయాలని అన్నం తినే ముందు చేతుల్ని పరిశుభ్రంగా సబ్బుతో కడుకోవాలని ప్లేట్లు కూడా శుభ్రంగా సబ్బుతో శుభ్రపరచుకోవాలని ఆయన సూచించారు మీకు ఏమైనా ఆరోగ్య సమస్య ఉన్నప్పుడు స్థానికంగా ఉన్న ఆశా కార్యకర్తకి వెంటనే తెలియపరచవలసిందిగా ఆయన కోరారు ఈ కార్యక్రమంలో మండల హెల్త్ ఆఫీసర్ పి జీవన వరప్రసాద్ ఆశ్రమ చైర్మన్ గరికపాటి శంకర్రావు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జి ప్రియదర్శిని ఏఎన్ఎం శారద ఆశా కార్యకర్తలు చిలక సుజాత డి మరియమ్మ ఎస్కే ముంతాజ్ బేగం కే సైదమ్మ ఆశ్రమం సూపర్వైజర్ షేక్ వలియా భి. తదితరులు పాల్గొన్నారు

## బాబు జగ్జీవన్ రామ్ జీవిత ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి: బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరి నాయుడు



ఆదోని ప్రజాపాలన ప్రతినిధి : ఆదోని డివిజన్ బీసీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరి నాయుడు అధ్యక్షతన బాబు జగ్జీవన్ రామ్ 37వ వర్ధంతి ఘనంగా జరుపుకోవడం అయినది. ముందుగా బీసీ నాయకులు బాబు జగ్జీవన్ రామ్ గారి విగ్రహం నకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించడమైనది. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరి నాయుడు మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ గారు ( ఏప్రిల్ 5, 1908న జన్మించారు. జూలై 6 1986న మరణించారు) 87 సంవత్సరములు ఈయన పేరు పొందిన స్వాతంత్ర సమరయోదుడు, సంఘసంస్కర్త, రాజకీయవేత్త, బీహార్ లో వెనకబడిన వర్గాల నుంచి వచ్చినవాడు అతను బాబుజిగా ప్రసిద్ధుడు భారత పార్లమెంటులో 40 ఏళ్ల పాటు వివిధ మంత్రుల పదవులు నిర్వహించడమే గాక ఉప ప్రధానిగా వ్యవహరించాడు 1935లో అంటరాని వారికి సమానత్వం కోసము అంకితమైన ఆల్ ఇండియా డిప్రెస్ట్ క్లాసెస్ లీగ్ అనే సంస్థను స్థాపించడంలో అతను కీలక పాత్ర పోషించాడు 1937లో శాసనసభకు ఎన్నికయ్యాడు ఆ తర్వాత గ్రామీణ కార్మిక ఉద్యమాన్ని ప్రారంభించాడు. మంత్రిగా పనిచేశాడు మరి ముఖ్యంగా అతను 1971 ఇండో పాక్ యుద్ధం జరిగిన సమయంలో భారత రక్షణ మంత్రిగా ఉన్నాడు. ఫలితంగా బంగ్లాదేశ్ ఏర్పాటుకు సుగమము ఏర్పడింది. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు పి. సాయిబాబ,ఆదోని డివిజన్ గౌరవ సలహాదారులు దేవి శెట్టి ప్రకాష్ , తాలూక ఆర్గనైజేషన్ సెక్రటరీ రిటైర్డ్ ఎమ్మార్వో షేక్ శావాలి, పట్టణ అధ్యక్షులు డాక్టర్ వీరేష్, పట్టణ గౌరవ సలహాదా రులు కపటి వీరభద్ర,రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మాటిచ్చి మోసం చేస్తారా...!

## సీఎం కి నిరుద్యోగుల ఆవేదన పట్టదా....?

## ఖాళీ ఉద్యోగాలు భర్తీ చేయాలి ....!

## ఏఐవైఎఫ్ పల్నాడు జిల్లా కన్వీనర్ షేక్ సుభాని







పల్నాడు జిల్లా నరసరావుపేట జూలై 6.(ప్రజాపాల ప్రతినిధి): నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తానని నమ్మవలసి నిరుద్యోగుల ఓట్ల ద్వారా అధికారంలోకి వచ్చి నేడు ఇచ్చిన మాటను తప్పి మాట మార్చను మడమ తిప్పను అంటూనే సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి మాట తప్పి మడమతిప్పరని రాష్ట్ర ముఖ్యమంత్రి గారు ప్రతిపక్షంలో నిరుద్యోగ బేరీలు యువభేరీలు నిర్వహించిన మీరు ఈరోజు అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగులను కలిసే అవకాశం కూడా ఇవ్వకపోవడం దురదృష్టకరమని అఖిల భారత యువజన సమాఖ్య ఏఐ వై ఎఫ్ పల్నాడు జిల్లా కన్వీనర్ షేక్ సుభాని విమర్శించారు. రాష్ట్రంలోవివిధ శాఖలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ అఖిలభారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సమితి పిలుపుమేరకు కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాని మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఖాళీగా ఉన్న 2 ,35,794/- ఉద్యోగాలు భర్తీ చేస్తామని అందుకోసం ప్రతి సంవత్సరం జనవరిలో ఉద్యోగ ప్రకటనల కాలపట్టిక ( జాబ్ క్యాలెండర్) ప్రకటిస్తామని జగన్ మోహన్ రెడ్డి మాటిచ్చి మోసం చేసారని, కాళీ ఉద్యోగాలు భర్తీ చేయాలన్నారు. అధికారంలోకి వచ్చాక గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగాలు, కరోనా కాలంలో వైద్య శాఖ లో కొన్ని, అరకొర ఔట్సోర్సింగ్ కాంట్రాక్టు పద్ధతిలో కొన్ని అవి కూడా అధికార పార్టీ వారికి అమ్ముకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెలా నాసర్ జి మాట్లాడుతూ ఏపీపీఎస్సీ ద్వారా 4594 మాత్రమే భర్తీ చేసింది కానీ ఖాళీగా ఉన్న ఏపీపీఎస్సీ గ్రూప్ 1,2,4 తోపాటు ఎగ్జిక్యూటివ్ ,నాన్ ఎడ్యుకేట్, ఇంజనీరింగ్ , పాఠశాల ఉపాధ్యాయులు, వివిధ కళాశాల అధ్యాపకులు విశ్వవిద్యాలయ అధ్యాపకులు , వంటి ఉద్యోగాలు ఖాళీగా ఉన్న భర్తీ చేయడం లేదు. కావున ఈ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలన్నారు. ప్రాథమిక పరీక్ష లో అర్హత సాధించిన పోలిస్ కానిస్టేబుల్,ఎస్ఐ అభ్యర్థులకు పిజికల్ ఈవెంట్స్ నిర్వహించాలని, పశు సంవర్ధక శాఖా లోని అనిమల్ హస్బుండరి అసిస్టెంట్స్ ఉద్యోగాలు భర్తీ చేయాలని ,ఏపీపీఎస్సీ గ్రూప్ 1,2, మరియు 4 తోపాటు వివిధ శాఖల లోని ఖాళీలను భర్తీ చేయాలని ,మెగా డీఎస్సీ విడుదల చేసి ఖాళీగా ఉన్న 55 వేల ఉపాధ్యాయ ఉద్యోగాలూ భర్తీ చేయాలి ,గ్రామ వార్డు సచివాలయాలలో ఖాళీగా ఉన్న 20వేల ఉద్యోగాలు భర్తీ చేయాలని,కళాశాలల మరియు విశ్వవిద్యాలయ అధ్యాపక ఉద్యోగాలు భర్తీ చేయాలని,వివిధ శాఖలలోని ఇంజనీరింగ్ ఉద్యోగాలు భర్తీ చేయాలని,ప్రాథమిక (ప్రిలిమ్స్) ప్రధాన (మెయిన్స్ ) పరీక్ష విధానం రద్దుచేసి ఒకే పరీక్ష నిర్వహించాలి ,నెగిటివ్ మార్క్ లు పెట్టవద్దనీ ,ఏపీపీఎస్సీ మరియు ఇతర ఉద్యోగ నియామక పరీక్షల ప్రశ్న పత్రాలు తెలుగును ప్రామాణికం చేసుకొని తయారు చేయాలి ,వయోపరిమితి 45 సంవత్సరాలకు పెంచాలి, ప్రతి జిల్లాలో ప్రభుత్వ శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నాడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పలు జిల్లాలలో నిరుద్యోగ భేరి యువభేరీలు నిర్వహించి నిరుద్యోగులను నమ్మబలికి వారి ఓట్ల ద్వారా అధికారంలోకి వచ్చి నేడు నిరుద్యోగుల సమస్యలు పట్టించుకోవడంలేదని ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని మాట తప్పను మడమ తిప్పను నేను ఉన్నాను నేను విన్నాను అని చెప్పి నేడు అధికారంలోకి వచ్చాక మాట తప్పి మడమ తిప్పి చెవులు ఉండి వినలేని పద్ధతిలో నిరుద్యోగులకు కనీసం కలిసి అవకాశం కూడా ఇవ్వకుండా చిన్నచూపు చూస్తున్నారని ఉద్యోగాలు భర్తీ చేయకుంటే ఏ నిరుద్యోగులు అయితే నిన్ను నమ్మి ఓట్లు వేసి గెలిపించారు అదే నిరుద్యోగులు

ఈ రాష్ట్ర ప్రభుత్వానికి తగిన బుద్ది చెవుతారని హెచ్చరించారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి కె వినాయకం కు వినతిపత్రాన్ని అందచేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు ఆనంద్, వాజ్య నాయక్,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## యువత మహనీయుల మార్గాలను అనుసరించాలి: కరాలపాటి జాని



దాచేపల్లి ప్రజాపాలన న్యూస్ :భారత తొలి ఉప ప్రధానమంత్రి గా పని చేసిన డాక్టర్ బాబు జగజీవన్ రామ్ వర్ధంతి కార్యక్రమాన్ని పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గం లోని దాచేపల్లి నగర పంచాయతీలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ మైనార్టీ డిపార్ట్మెంట్ కార్యదర్శి కరాల పాటి జానీ ఘనంగా నిర్వహించారు ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.బీహార్ రాష్ట్రంలోని భోజ్పురి జిల్లాలో చంద్వా గ్రామంలో ఒక నిరుపేద దళిత చెమ్మర్ కుటుంబంలో 19 0 8 ఏప్రిల్ 5న జన్మించిన బాబు జగజీవన్ రావ్ .జగజీవన్ రామ్ విద్యాభ్యాసం కపిల ముని పాఠశాలలో 1914 లో ప్రారంభమైంది ఈ సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ మైనార్టీ డిపార్ట్మెంట్ కార్యదర్శి కరాలపాటి జాని మాట్లాడుతూ దళితుల అభివృద్ధికి జీవితాన్ని అంకితం చేసిన మహానుభావుడు అని, బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో ఇంటర్ పూర్తి చేసి డిగ్రీ చదివే రోజుల్లో రవిదాస్ దళితుద్దోరున మహాసభల్లో పాల్గొన్నారన్నారు. వీరికి ఎనిమిదవ యేటనే వివాహం జరిగిందని, కానీ ఒక సంవత్సరం కాలంలోనే ఆమె మృతి చెందిందన్నారు.పాఠశాల దశలోనే వీరు తరగతి పుస్తకాలతో పాటు లైబ్రరీకి వెళ్లి అనేక పుస్తకాలు చదివి 1921లో మెట్రిక్ పూర్తి చేశారు అని ,చదువులో ముందుండి కులప్రస్థాపనలేని మెరిట్ స్కాలర్షిప్ పొందారు అని తెలిపారు.1929 లో లాహోర్ జరిగిన అఖిలభారత సమావేశంలో పాల్గొని తాను హరిజన పక్షపాతినని పెద్దల ముందు ధైర్యంగా మాట్లాడిన వ్యక్తి డాక్టర్ బాబు జగజ్జీవన్ రామ్ అని,1927లో కాన్పూర్ లో జరిగిన దళిత మహాసభలో పాల్గొని ఉపన్యాసించారన్నారు.ఆ తరువాత 1930 లో స్వాతంత్ర ఉద్యమంలో భాగస్వాములై స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్న గొప్ప స్వాతంత్ర సమరయోధుడు డాక్టర్ బాబు జగజీవన్ రావ్ అని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వ కాలంలో కేంద్రం లో వ్యవసాయ శాఖ మంత్రిగా ,ఆహార శాఖ మంత్రిగా, కార్మిక శాఖ ఉపాధి పునరావస శాఖ మంత్రిగా, తంతి తపాలా రైల్వే శాఖ మంత్రిగా కేబినెట్ హోదాల్లో పలు పదవులు అలంకరించి పదవులకే వన్నె తెచ్చిన గొప్ప వ్యక్తి డాక్టర్ బాబు జగజీవన్ రామ్ అని అన్నారు .స్వాతంత్ర ఉద్యమ కాలంలో జైలు జీవితం గడిపే స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్న స్వాతంత్ర సమరయోధుడు డాక్టర్ బాబు జగజీవన్ రామ్ నిజాయితీ అంకిత భావం సేవ తర్పర తనే కవచాలుగా చేసుకొని భావితరాలకు ఆదర్శ ప్రాయుడు ఇటువంటి మహానుభావుల్ని భావితరాలు గుర్తుంచుకోవాలని గౌరవించుకోవాలని వారు చూపినటువంటి బాటలో నడవాలని యువత రాజకీయాల్లోకి వచ్చి ప్రజలకు దేశానికి సేవ చేయాలని ఈ సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ మైనార్టీ డిపార్ట్మెంట్ కార్యదర్శి కరాలపాటి జానీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు షేక్ సైదా, అన్నం అజయ్, నాగుల్ మీరా ,ఆదినారాయణ, సామేలు రమేష్, గోపాల్ రావు తదితరులు పాల్గొన్నారు.

## పట్టణ నడిబోడ్డులో చెత్త సేకరణ కేంద్రం ఏర్పాటు దుర్మార్గపు చర్య: అర్యవైశ్యా ప్రముఖుడు గోకవరపు సునీల్



గుడివాడ : పట్టణంలోని నడ్డిబోడ్డులో ఉన్న తుమ్మల రామబ్రహ్మం పార్కులో ఆర్యవైశ్య కళ్యాణమందిరాన్ని అనుకొని చేత్త సేకరణ కేంద్రం ఏర్పాటు చేయాడం దుర్మార్గపు చర్యని అర్యవైశ్యా ప్రముఖుడు, టిడిపి రాష్ట్ర వాణిజ్య ప్రధాన కార్యదర్శి గోకవరపు సునీల్కుమార్ మండిపడ్డారు. గురువారం స్థానిక తుమ్మల రామబ్రహ్మం పార్కులో ఆర్యవైశ్య ప్రముఖులు తిరివీధి సుబ్బారావు, దోసపాటి హరిప్రసాద్, యేక్కల మణిదీఫ్లతో కలసి గోకవరపు సునీల్కుమార్ మాట్లాడుతూ రామబ్రహ్మం పార్కుని అనుకుని దేవాలయం, పోలీసుస్టేషన్, అసుప్రతి, సచివాలయం ఉన్న చోట ఎమ్మెల్యే కొడాలి అదేశామాని మున్సిపల్ అధికారులు సేత్తసేకరణ కేంద్రం పెట్టాడం ఎమిటని ప్రశ్నించారు. ఈ ప్రాంతంలో వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఉన్న చోట చెత్త సేకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం వల్ల భక్తుల మనోభావాలు దెబ్బతింటాయన్నారు. ఎమ్మెల్యే అనే వ్యక్తి ఇలాంటి చర్యలు తీసుకోవడం భాదకరమన్నారు. వెంటనే చెత్త సేకరణ కేంద్రాన్ని తొలగించాలని, లేని పక్షంలో కోర్టుకు వెళ్ళాతమన్నారు. ఈ విషయంలో ప్రజల ఇబ్బందులను గుర్తించి అధికారులు చెత్త సేకరణ కేంద్రాన్ని తొలగించాలని విజ్ఞప్తి చేశారు.



జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన

సంపాదకీయం

శుక్రవారం 07, జులై 2023

# దేశానికి కరెంటు ఇద్దాం

ప్రభుత్వాలకు 'లక్ష్యం' లేకపోవడం వల్లనే దేశవ్యాప్తంగా ప్రజలు, ప్రత్యేకించి రైతులు అలవికాని బాధలకు గురవుతున్నారని, రైతుల ఆత్మహత్యలు అత్యంత విషాదకరమని తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇటీవల మహారాష్ట్రలో జరిగిన బహిరంగ సభలో అన్నారు. ప్రభుత్వాలకు దృఢ నిశ్చయం ఉంటే ఈ పరిస్థితిని మార్చవచ్చని ఆయన తేల్చిచెప్పారు. దేశంలో 18 కోట్ల 10 లక్షల హెక్టార్ల వ్యవసాయ యోగ్యమైన భూమి అందుబాటులో ఉండగా అందులో 15 కోట్ల 40 లక్షల హెక్టార్ల భూమి సాగవుతున్నది. 7 కోట్ల 20 లక్షల హెక్టార్ల భూమి వివిధ పథకాల ద్వారా నీటి వసతిని పొందుతుండగా మిగతా 8 కోట్ల 20 లక్షల హెక్టార్ల భూమిని కేవలం వర్షం మీద ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారు రైతులు. ఇక్కడ మరో ఆసక్తికరమైన విషయం ఏమంటే 7 కోట్ల 20 లక్షల హెక్టార్ల తరి భూమిలో 3 కోట్ల 50 లక్షల హెక్టార్ల భూమికి భూగర్భ జలాలే ఆధారం. అంటే ప్రభుత్వ ప్రోత్సాహం లేని బావులు, బోర్ల ద్వారా సాగవుతున్న భూమి అన్నమాట. రైతులు ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి బోర్ల ద్వారా నీటిని తోడి వ్యవసాయానికి పూనుకుంటే తెలంగాణ మినహా మరే రాష్ట్రంలోనూ కనీస ప్రోత్సాహం, ఆర్థికావలంబన లభించడం లేదు. దేశంలోని పెద్ద రాష్ట్రాలను ఒక్కసారి పరిశీలించినట్లయితే మన పొరుగు రాష్ట్రం కర్ణాటకలో 6 నుంచి 7 గంటల కరెంటు మాత్రమే రైతులకు అందుతున్నది. 4 గంటలు పగటిపూట, 2 గంటల నుంచి 3 గంటలు రాత్రిపూట. మహారాష్ట్ర రైతాంగానికి వచ్చే మూడేండ్లలో పగలు 8 గంటలు కరెంటు ఇవ్వడానికి కావాల్సిన చర్యలు చేపడుతున్నామని మహరాష్ట్ర స్టేట్ ఎలక్ట్రిసిటీ డిస్ట్రిబ్యూషన్ ఎంఎస్ఈడీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ విజయ్ సింఘాల్ ఆ మధ్యన ప్రకటించారు. కానీ, ప్రస్తుత పరిస్థితి దయనీయంగా ఉందనడంలో సందేహం లేదు. దీనికి తోడు బిల్లులు కట్టలేదని రైతుల కనెక్షన్లు తొలగిస్తున్నారు. 45 లక్షలకు పైబడి వ్యవసాయ పంపు సెట్లు కలిగిన మహారాష్ట్రలో రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్తుకు బడ్జెట్‌లో రూ.5,500 కోట్లు మాత్రమే కేటాయించడం బాధాకరం. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని పశ్చిమాంచల్ విద్యుత్ వితరణ్ నిగం లిమిటెడ్ పరిధిలోని మూడున్నర లక్షలకు పైగా పంపుసెట్లు కలిగి ఉన్న రైతులు రూ.2,600 కోట్లు బకాయి పడి ఉన్నారని కనెక్షన్లు తొలగించడం తో రైతులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేస్తున్నారు. జనవరి, 2022 ఎన్నికల్లో రైతులకు ఉచిత విద్యుత్తు హామీనిచ్చిన అక్కడి ప్రభుత్వం ఎన్నికల అనంతరం హామీ అమలుపరచకుండా రైతులను వేధిస్తున్న ఆరోపణలు ఎదుర్కొంటున్నది. యూపీ ప్రభుత్వం విద్యుత్తు రంగానికి కేటాయించిన బడ్జెట్‌లో వ్యవసాయరంగానికి ఇచ్చింది రూ.1,250 కోట్లు మాత్రమే. పూర్వాంచల్, పశ్చిమాంచల్, మధ్యాంచల్, కాన్పూర్ తదితర ప్రాంతాల రైతులకు కావల్సినంత కరెంటు అందించలేక అక్కడి సర్కార్ ఆపసోపాలు పడుతున్నది. ప్రధాని స్వరాష్ట్రం గుజరాత్ విషయానికి వస్తే వ్యవసాయానికి 8 గంటల కరెంటు రెండు విడతలుగా ఇస్తున్నది. 18 లక్షలకు పైగా వ్యవసాయ కనెక్షన్లున్న గుజరాత్‌లో 11 కేవీ ఫీడర్లను 153 గ్రూపులుగా విభజించి రొటేషన్ పద్ధతిలో కరెంటు సరఫరా చేస్తున్నారు. రాత్రిపూట కరెంటు వల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. కాబట్టి 18,000 గ్రామాల రైతులకు పగటిపూట కరెంటునందించడానికి 2021లో 'కిసాన్ సూర్యోదయ యోజన' పథకాన్ని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రారంభించారు. కానీ ఆ కార్యక్రమం ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు. మధ్యప్రదేశ్‌లో 11 కేవీ ఫీడర్లను ఏ, బీ గ్రూపులుగా విభజించి పగలు 4 గంటలు, రాత్రిపూట 6 గంటలు వెరసి 10 గంటలు కరెంటు ఇస్తున్నామని చెప్తున్నప్పటికీ సరిపోను కరెంటు అందక సమయానికి విత్తనాలు, ఎరువులు లభించక అక్కడి రైతాంగం తరచుగా రోడ్డెక్కుతున్నారు. మధ్యప్రదేశ్‌లో 5 హెచ్‌పీ మోటర్ వినియోగించుకునే రైతు నెలకు రూ.2,600 బిల్లు కడుతున్నాడు. అదే సమయంలో తెలంగాణ రాష్ట్రంలోని ప్రభు త్వం వ్యవసాయరంగానికి నిరంతర, నాణ్యమైన విద్యుత్తును అందించడానికి సుమారు రూ.6 వేల కోట్లు వెచ్చించి సబ్‌స్టేషన్ల విస్తరణ, నూతన 33 కేవీ, 11 కేవీ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంపు వంటి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ పెద్ద ఎత్తున చేపడుతున్నది. 2014 నాటికి 138 మిలియన్ యూనిట్ల రోజువారీ విద్యుత్తు వినియోగం నేడు 274 మిలియన్ యూనిట్లకు చేరుకున్నది. 'వాకింగ్ ఆన్ టు లెగ్స్' అంటాడు మావో. ఒకటి వ్యవసాయరంగం, రెండోది పరిశ్రమలు. అప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుంది, ప్రజలు సుభిక్షంగా ఉంటారు. వ్యవసాయరంగం విషయానికి వస్తే తెలంగాణ అగ్రగామిగా నిలిచి వంద మార్కులు సాధించిందనడంలో ఎవ్వరికీ అభ్యంతరం లేదు. గుజరాత్ విషయానికి వస్తే వ్యవసాయానికి 8 గంటల కరెంటు రెండు విడతలుగా ఇస్తున్నది. 18 లక్షలకు పైగా వ్యవసాయ కనెక్షన్లున్న గుజరాత్‌లో 11 కేవీ ఫీడర్లను 153 గ్రూపులుగా విభజించి రొటేషన్ పద్ధతిలో కరెంటు సరఫరా చేస్తున్నారు. రాత్రిపూట కరెంటు వల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. కాబట్టి 18,000 గ్రామాల రైతులకు పగటిపూట కరెంటునందించడానికి 2021లో 'కిసాన్ సూర్యోదయ యోజన' పథకాన్ని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రారంభించారు. కానీ ఆ కార్యక్రమం ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు.


# ఇటు భయం తగ్గింది, అటు మొదలైంది!

ఇంత బేలగా మారిపోయిందేమిటి బిజెపి? కర్ణాటక ఫలితాలు ఇంతగా కుంగదీశాయా? కాంగ్రెస్ ముక్త్ భారత్ కల కాస్తా చెదిరిపోయి, ఆరడుగుల లోతున పాతిపెట్టిన ఎన్డీయేకు ప్రాణం పోసి ముస్తాబు చేయవలసిన అవసరం వచ్చింది. మెజారిటీకి తక్కువ అయ్యే లెక్కను కూడగట్టడానికి చాలా కష్టం పడవలసి వస్తోంది. అన్నిటికి మించి, భయపడవలసివస్తోంది, ఎందుకోసమైనా, ఒకసారి మొదలుకావాలే కానీ, భయం లోలోపలినుంచి తొలిచేస్తుంది. బండి సంజయ్‌ను విమర్శించడానికి, కొండొకచో హేళన చేయడానికి కూడా ఆయనే అనేక అవకాశాలిస్తారు. కానీ, ఆయన నాయకత్వంలో తెలంగాణ బిజెపిలో ఉత్సాహం, చురుకుదనం వచ్చాయని ఎవరైనా ఒప్పుకుంటారు. ఆయనను తప్పించడం మంచిది కాదని పార్టీలో ఎన్నో వేడికోళ్లు వెళ్లాయి. చివరకు, పరివార సంస్థల నుంచి కూడా అభ్యంతరాలు వెళ్లాయి. పోనీ, ఆ 'కిరీటం' ఎవరికి పెడుతున్నారో వారు సంతోషంగా ఉన్నారా అంటే అదీ లేదు! ముసిరిన అసమ్మతి నుంచి ఇంతకాలం సంజయ్‌ను కాపాడుతూ వస్తున్న అభయహస్తం ప్రధాని మోదీయే అన్నారు. అయినా, ఇన్ని అండదండలున్నా, ఆయనను తప్పించక తప్పలేదు. మాతృసంస్థ కన్నా, మోదీ ఆశీస్సులకన్నా బలమైన శక్తీ, అవసరమూ ఏమై ఉంటాయి? ఊహలకేం అనేకం చేయవచ్చు, కానీ ఒక్క పేరు మాత్రమే వాస్తవానికి దగ్గరగా వస్తుంది. ఆ ఒక్కరితో సంధి కావడమో, లేదా ప్రలోభపడడమో, బెదరడమో ఎందుకు? సామదానభేద దండోపాయాలు పనిచేయని శక్తి కాదు కదా? ఆ ఒక్కరి గుప్పిట్లో ఏదో మంత్రదండం ఉండి ఉండాలి. మద్యం కేసుకు మించిన మహాకేసు మరేదైనా అవతలిపక్షం దగ్గర ఉన్నదా? లేదా, ఆ ఒక్కరితో ఏదో ఉమ్మడి ప్రయోజనం ఉండాలి. కర్ణాటక ఇద్దరినీ బాగా భయపెట్టి ఉండాలి. కాంగ్రెస్ బలపడడంలో ఇద్దరికీ ఏదో ప్రమాదం తోచి ఉండాలి. రాజేందర్ కోసమే సంజయ్‌ను తొలగించారని మాత్రం అనుకోలేము. ఎన్నికల నిర్వహణ కమిటీ పదవి పరవాలేదు. చేరికల కమిటీ కంటె నయమే కాబట్టి, రాజేందర్, ఆయన అనుచరులు సంబరంగా ఉండడంలో తప్పు లేదు. ఈటల నుంచి బిజెపి అధిష్ఠానం దీర్ఘకాలంలో ఏమి ఆశిస్తోందో తెలియదు కానీ, తక్షణం ఆయన పార్టీ మారకుండా ముందరి కాళ్లకు బంధం పడింది. మొత్తం వ్యవహారంలో అంతో ఇంతో లబ్ధిదారుడు ఆయనే కాబట్టి, వెంటనే ఎనిమిదో తేదీ మోదీ సభను జయప్రదం చేయవలసిన మూడ్‌లోకి వెళ్లిపోయారు. ఆ హడావిడిలో పడి, సభ ప్రధానంగా కిషన్ రెడ్డి బాధ్యత కిందికి వస్తుందని మరచిపోకూడదు. అసలే, ఇంటిపోరుకు మారుపేరని రాష్ట్ర బిజెపికి చెడ్డపేరు పడింది! తెలంగాణ బిజెపి గొడవల్లో జాతీయ నాయకులు కూడా పవిత్రంగా మిగలకపోవడం ఆశ్చర్యం. బండి సంజయ్‌కు, తరుణ్ ఛుగ్‌కు ఉన్న దగ్గరితనం గురించి ఏవేవో కథనాలు వస్తున్నాయి. తెలంగాణ పార్టీపై పట్టు కోసం తరుణ్ ఛుగ్‌కు, సునీల్ బన్సల్‌కు మధ్య నడచిన నిశ్శబ్ద యుద్ధం చిన్నదేమీ కాదని చెబుతున్నారు. ఇన్ని గొడవల మధ్య బి.ఎల్. సంతోష్ పేరు




కూడా అప్పుడప్పుడు వినిపిస్తోంది. బిజెపి జాతీయస్థాయిలో కానీ, రాష్ట్రాల స్థాయిలో కానీ, సంస్థాగత వ్యవహారాలలో ఇట్లా ఉండేది కాదని ఆ పార్టీ సీనియర్లే బాధపడుతున్నారు. మహారాష్ట్ర పరిణామాలను చూసి అజిత్ పవార్ పదవీ లౌల్యాన్ని, శరద్ పవార్ ద్వంద్వత్వాన్ని అందరూ నిందిస్తున్నారు కానీ, రాష్ట్రాలను చేజిక్కించుకోవడం కోసమని, అప్పటిదాకా అవినీతిపరులుగా నిందించినవారినే పిలిచి పీటలు వేస్తున్నందుకు తమ పార్టీ అగ్రనేతలే సిగ్గుపడాలని పాతతరం బిజెపి అభిమానులు అనుకుంటున్నారు. ఇప్పుడు తెలంగాణ బిజెపి ముందు, దాని బిటీమ్‌గా ఆరోపణలు ఎదుర్కొంటున్న భారత రాష్ట్రసమితి ముందు ఒక ప్రధాన కర్తవ్యం ఉన్నది. తామిద్దరి మధ్యా ఏ అవగాహనా, పొత్తూ, ఒప్పందమూ, ఏర్పాటూ లేవని జనాన్ని నమ్మించగలగాలి. ఎట్లా? వాస్తవాలు ఏమైనప్పటికీ, ప్రజలలో ఆ అభిప్రాయం బలంగా ఉన్నది. రాహుల్ గాంధీ మొన్న ఖమ్మంలో తన ప్రసంగంలో కూడా బిజెపి బంధువుల సంస్థ అని బిఆర్ఎస్‌ను అన్న తరువాత, ఆ ఆరోపణకు మరింత బలం చేకూరింది. బిజెపితో బాహాటపు చెలిమి రాజకీయంగా నష్టదాయకమని బిఆర్ఎస్‌కు తెలుసు. ఆ ఇద్దరూ ఒకటి అని ఎంత బలంగా నిర్ధారణ అవుతే, ద్విముఖపోటీ భావన అంతగా బలపడుతుంది. ద్విముఖపోటీలో ఫలితం తనకు అనుకూలంగా ఉంటుందో ఉండదో అన్న అనుమానం కెసిఆర్‌కు కూడా ఉన్నది. అందుకే ఇంతకాలంగా, బిజెపి, కాంగ్రెస్ లను ఒకరిని పెంచుతూ, మరొకరిని తగ్గిస్తూ తంటాలు పడ్డారు. కానీ, ఇప్పుడు పెరగడానికి బిజెపి సుముఖంగా లేదని తాజా పరిణామాలు సూచిస్తున్నాయి. అసమ్మతి ఇంకా సజీవంగా, చురుకుగా ఉండగా, తనకే ఆసక్తి లేని బాధ్యతను కిషన్ రెడ్డి మాత్రం విజయవంతంగా నెరవేర్చగలరా? పెరగడానికి బిజెపికి నిజంగా ఆసక్తే ఉంటే, అసలు ఈ తొలగింపులు, నియామకాలు ఎందుకు? తెలంగాణ చేజిక్కించుకోవాలన్న ఆశను బిజెపి ఇక ఈ ఎన్నికలకు వదిలేసిందన్న అభిప్రాయాన్ని రాజేందర్ ఒప్పుకోకపోవచ్చు. తను పెరిగిన వాతావరణంలో, తనచుట్టూ ఉండే మనుషులలో అప్రదిష్ట వస్తుందని తెలిసినా ఆయన బిజెపిలో చేరింది కెసిఆర్‌కు గుణపాఠం చెప్పాలన్న బలమైన కోరిక వల్ల! దానికి ఇప్పుడు ఆస్కారం లేదన్నమాట ఆయనను బాధించడం సహజం. ఈ ఊహాలన్నీ చేస్తున్నవారు నాలిక కరుచుకోవలసి వస్తుందా, లేక, రాజేందరే పశ్చాత్తాపపడవలసి వస్తుందా? ఎన్నికలు బాగా సమీపించాక కానీ తెలియదు. అయితే గియితే లోపాయికారీ ఒప్పందం ఎట్లా ఉండవచ్చు? బహిరంగ పొత్తులు ఉండే సమస్య లేదు. అసెంబ్లీ ఎన్నికలలో మేము ఉదాసీనంగా ఉంటాము, పార్లమెంటు ఎన్నికల్లో ఐదారుసీట్లతో కనికరించాలని బిజెపి అడిగినట్టు, అందుకు అవతలిపక్షం అంగీకరించినట్టు అంతా అనుకున్నారు. అంత మాత్రమే కాకపోవచ్చు. అసెంబ్లీ ఎన్నికల్లో కూడా క్రియాశీల 'సహకారం' ఉండవచ్చు. ఫార్ములా ఒకటే. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా ఉంటే కాంగ్రెస్ గెలిచే అవకాశం ఉంటుంది. దాన్ని చీల్చాలి. కాంగ్రెస్ బలంగా పోటీ ఇచ్చే చోట ఇద్దరు బలమైన ప్రత్యర్థులే ఉంటారు, ధనబలంతో, అంగబలంతో. కొంచెం మార్పు చేర్పులతో ఇదే వ్యూహం ఖాయమని చెప్పుకుంటున్నారు. మరి, రాజేందర్ తనను బయటకు గెంటి ఇబ్బందులు పెట్టిన పార్టీ విజయానికే పనిచేస్తారా? ఇక మజ్లిస్ ఇత్తెహాదుల్ ముసల్మీన్ దగ్గర నుంచి అనేక మైనర్ పార్టీలు వాటి గేమ్ అవి ఆడతాయి. మజ్లిస్ బిఆర్ఎస్‌కు తోడుగా ఉంటూ వచ్చింది. బిఆర్ఎస్, బిజెపి రెండూ ఒకటే అనేది నిజమే అయితే, మజ్లిస్‌కు పెద్ద నైతిక సమస్య ఉండదు. ఆ రెండూ ఒకటి కాకపోతే కూడా మజ్లిస్‌ను తమకు అనుకూలంగా పనిచేయించుకోగలిగిన చాకచక్యం, చాణక్యం బిజెపికి ఉంది. ఈ పక్షాలన్నీ, అసెంబ్లీ ఎన్నికలలోనే తమ సర్వశక్తులూ ఒడ్డి, బిజెపి శక్తిని యథాతథంగా నిలిపి, 2024 సాధారణ ఎన్నికలలో ఏ తేడా రాకుండా చూస్తాయి కాబోలు. ప్రజల నాడి భిన్నంగా ఉండి, అసెంబ్లీ ఎన్నికలలో ఓటింగ్ సరళి ప్రత్యామ్నాయాల ఎంపికగా ఉంటే, ఈ అవకాశవాద మైనర్ పార్టీలే, అటువైపు చేయిచాస్తాయి! ఈ చర్చలో మనం ఇంకో ముఖ్యమైన పాత్రధారిని తక్కువ అంచనా వేస్తున్నాం. తనను తాను ఓడించుకునే విచిత్రమైన క్రీడలో బిజెపి తాజాగా మాత్రమే ప్రవేశించింది. కాంగ్రెస్ అందులో సెంచరీలు కొట్టింది. ప్రజలలో కొద్దోగొప్పో సమకూరుతున్న మద్దతును, ప్రభుత్వ వ్యతిరేక వాతావరణాన్ని తామే భగ్నం చేసుకోగల ఆత్మ వినాశ విద్యలో నేర్పరులు కాంగ్రెస్ నేతలు! దేశమంతా దడదడలాడిస్తున్న బిజెపినే బేరాలకు దింపగలిగిన కెసిఆర్, కాంగ్రెస్‌ను దాని మానాన దాన్ని వదిలేస్తారా? ఆయనకు అన్ని పార్టీలలోనూ శ్రేయోభిలాషులుంటారు. తమలోతాము కలహించుకుని, మేలు చేసేవారుంటారు. కాంగ్రెస్‌కు ఏ మాత్రం ప్రయోజనం కలగకుండా చేయడం కోసమే, తెలంగాణలో బిజెపి సంస్థాగతంగా తన ప్రయోజనాలకు ప్రతికూలమైన నిర్ణయం తీసుకున్నది. నిజానికి తెలంగాణలో కాంగ్రెస్‌కు విజయావకాశాలు అంత ఖచ్చితమైనవేమీ కావు. ఇప్పుడిప్పుడు ఆ పార్టీ చుట్టూ జనాభిప్రాయం కూడుతున్నది. ఈ ఏడాది తెలంగాణలో అయినా అధికారంలోకి రావచ్చునేమో కానీ, 2024లో కేంద్రంలో అధికారానికి రావడం దుస్సాధ్యం. తమ బలం మునుపటికంటే తగ్గుతుందన్నదే బిజెపి భయం. మితిమీరిన మెజారిటీకి అలవాటుపడడం ఏ పార్టీకైనా మంచిది కాదు. పెరుగుతూపోయేది విరిగిపోతుంది కూడా!

# దార్శనికుడి ఆలోచనే నేడు దాహం తీరుస్తున్నది!




1956లో కృష్ణా నదిపై ఆధారపడిన సాగు ఆయకట్టు ఎంతో తేల్చి, దానికి అనుగుణంగా మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య నీటి పంపిణీకి, వివాదాల పరిష్కారానికి నాటి దేశ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ 'కృష్ణా వాటర్ డిస్ప్యూట్స్ ట్రిబ్యునల్' ఏర్పాటు చేసారు. నాటి సుప్రీంకోర్టు జస్టిస్ రణధీర్ సింగ్ బచావత్‌ను ట్రిబ్యునల్ చైర్మన్‌గా నియమించారు. దాని ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో 7,278 చదరపు కిలోమీటర్ల స్థిర ఆయకట్టును నిర్ధారించారు. ఆంధ్రప్రదేశ్‌కు ఎగువన ఉన్న తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర ఎన్ని ముక్కలుగా విడిపోయినా మన ఆయకట్టుకు నాటి చట్టం ప్రకారం కృష్ణా జలాలను ఇవ్వవలసిందే. కారణం మనం నదికి పూర్తి దిగువన ఉండటం, ఇంకా మన హక్కును కాపాడే జస్టిస్ బచావత్ చట్టం. 58 సంవత్సరాల సుదీర్ఘ ప్రయాణం తర్వాత, నాలుగు తరాల బంధాన్ని తెంపి రెక్కలు కత్తిరించిన మొండానికి 'ఆంధ్ర' అని పేరు పెట్టింది కేంద్ర ప్రభుత్వం. ప్రతిఫలంగా రాజధానిని, పోలవరం ప్రాజెక్టును కేంద్ర నిధులతో నిర్మిస్తాం అని విభజన చట్టంలో పేర్కొంది. విభజిత ఆంధ్రప్రదేశ్‌కు చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయ్యారు. తెలంగాణ ప్రభుత్వమూ, ఇక్కడి ప్రతిపక్షాల కుట్రల వల్ల ఆంధ్ర డెల్టా ఆయకట్టుకు పొంచివున్న పెను ప్రమాదాన్ని చంద్రబాబు నాయుడు ముందే పసిగట్టారు. ప్రమాణ స్వీకారానికి ముందే పోలవరం ముంపు మండలాలను ఆంధ్రా భూభాగంలో కలిపితేనే పోలవరం కల సాకారం అవుతుందని, లేకుంటే ఆ ముంపు మండలాలను అడ్డు పెట్టుకుని కేసీఆర్ పోలవరాన్ని ఖచ్చితంగా అడ్డుకుంటాడని చంద్రబాబు అంచనా వేశారు. అందుకే ముంపు మండలాలను ఆంధ్రప్రదేశ్‌లో కలిపితేనే ప్రమాణ స్వీకారం చేస్తానన్న షరతు పెట్టి సాధించారు. పరుగులు పెట్టిన పోలవరం ఇప్పుడు ఎక్కడుందో మీకు తెలియంది కాదు. జగన్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు 'పోలవరానికి అన్ని డబ్బులు అవసరం లేదు. పాత అంచనాలనే అమోదించండి' అంటూ డజన్ల కొద్ది ఉత్తరాలు రాశారు. పోలవరం పూర్తి కావడం ఆలస్యం అయితే చట్ట ప్రకారం మనకు రావాల్సిన కృష్ణా నది నీళ్లు నాగార్జున సాగర్ ఎడమ కాలువ ద్వారా, లేదా సాగర్ డ్యామ్ గేట్లు ఎత్తడం ద్వారా మాత్రమే విజయవాడ ప్రకాశం బ్యారేజ్‌కు చేరుకుంటాయి. విజయవాడ నుంచి కృష్ణా, పశ్చిమ గోదావరి, గుంటూరు, ప్రకాశంలో కొంత భాగానికి తాగు, సాగు నీరు అందుతుంది. కానీ చంద్రబాబు నాయుడు ఊహించినట్టే జరిగింది. హక్కుగా మనకు రావాల్సిన నీళ్ళు ఒక్క చుక్క కిందకు దిగనివ్వలేదు కేసీఆర్. ఆ సమయంలో నేను స్వయంగా కృష్ణా నల్గొండ జిల్లాల సరిహద్దు, ఖమ్మం కృష్ణా జిల్లాల సరిహద్దు, ఖమ్మం పశ్చిమ గోదావరి జిల్లాల సరిహద్దులలోని పంట పొలాలను పరిశీలించాను. ఆంధ్ర పొలాలు బీడు భూములుగాను, నీటి దొంగతనం కారణంగా తెలంగాణ వైపు పొలాలు పచ్చగాను ఉండటం చూసి ఆశ్చర్యపోయాను. చంద్రబాబు నాయుడు దీన్ని కూడా ముందే ఊహించారు. అందుకు స్పందనగా ఆయన మనసులో పురుడుపోసుకున్న ఆలోచనకు ప్రతిరూపమే పట్టిసీమ. రూ.1,660 కోట్ల ఖర్చుతో పట్టాలెక్కిన పట్టిసీమలో రెండువేల కోట్ల అవినీతి జరిగిందంటూ అసెంబ్లీలో పూనకం వచ్చినట్టు ఊగిపోయారు జగన్‌రెడ్డి. కాంట్రాక్టర్లతో కుమ్మక్కయ్యి దోచుకోవడానికే పట్టిసీమ, అది ఉత్తసీమ అంటూ రంకెలు వేశారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం సాధించి జగన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. రివర్స్ పాలన ఎలా ఉంటుందో చూపిస్తా అన్నారు. రివర్స్ టెండరింగ్ విధానాన్ని తీసుకువచ్చారు. అప్పటివరకు అవిశ్రాంతంగా పనిచేస్తున్న, దేశంలోనే ఉత్తమ కంపెనీల్లో ఒకటైన ఇంజనీరింగ్ సంస్థను తప్పించి, తాను అప్పటివరకు ఆరోపణలు గుప్పించిన పట్టిసీమ కాంట్రాక్టరు చేతిలోనే పెట్టి పోలవరం గొంతు కోశారు. నేటికీ పోలవరం పూర్తి కాలేదు, పూర్తి కాదు. మరోపక్క కేసీఆర్ యథావిధిగా నీటి దొంగతనం కొనసాగిస్తూనే ఉన్నారు. చుక్క నీటిని కిందకు దిగనివ్వడం లేదు. 'పట్టిసీమ వద్దు' అంటూ సుప్రీంకోర్టు వరకు వెళ్లిన జగన్‌రెడ్డి, తను అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు పట్టిసీమ మోటర్ బటన్ నొక్కకపోతే కృష్ణా ఆయకట్టు లేదు, నాలుగు జిల్లాలకు తాగునీరు లేదు. ఇప్పటివరకు పట్టిసీమ నీటి ద్వారా జరిగిన సంపద సృష్టి రూ. 25 వేల కోట్ల పైమాటే. ఈ మహోన్నత యజ్ఞాన్ని ఒక్క ఏడాదిలో పూర్తి చేయడం వెనుక చంద్రబాబు నాయుడి ఆలోచన, అంతే చురుగ్గా పని చేసిన విభజిత ఆంధ్రప్రదేశ్? తొలి నీటి పారుదల శాఖా మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు కృషి విస్మరించజాలనివి.

## బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్ రామ్

### వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కందుల ఎజ్రా



పల్నాడు జిల్లా. నరసరావుపేట. జూలై 6 (ప్రజా పాలన ప్రతినిధి) శాసనసభ్యులు గౌరవనీయులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు గురువారం మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రావ్ 37వ వర్ధంతి సందర్భంగా వారి విగ్రహమునకు ఘనమైన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్సిపి జిల్లా ప్రధాన కార్యదర్శి కందుల ఎజ్రా మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రావు బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అంతేకాకుండా వారు మాజీ ఉప ప్రధానిగా , కార్మిక శాఖ మంత్రిగా రక్షణ శాఖ మంత్రిగా కేంద్రంలో పలు ఉన్నతమైన పదవులు అలంకరించారని అన్నారు. బడుగు బలహీన వర్గాలు ఆర్థికంగా ఎదగాలని ఎంతో కృషి చేసి గొప్ప వ్యక్తి అని అన్నారు. ఈ కార్యక్రమంలో కందుల ఎజ్రా, మాజీ కౌన్సిలర్ కొనంకి మత్తయ్య పంగులూరు విజయ్ కుమార్ గోపిరెడ్డి యువసేన అధ్యక్షుడు, ఎస్సీ సెల్ కన్వీనర్ మల్లెల అశోక్ , దామరపు రాఘవులు, మందపాటి రాజేష్, మరియు వైయస్సార్ సిపి ఎస్సి నాయకులు పాల్గొని జగ్జీవన్ రామ్ కి ఘనమైన నివాళులు అర్పించారు.

## సంక్షేమ పథకాలకు అర్హులను గుర్తించడమే లక్ష్యంగా జగనన్న సురక్ష. ఎమ్మెల్యే చంటిబాబు



గోకవరం, జూలై 6 ప్రజా పాలన: అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందించే లక్ష్యంతో గ్రామ, వార్డు సచివాలయాల వద్ద జగనన్న సురక్ష పేరుతో నిర్వహిస్తున్న ప్రత్యేక క్యాంపులు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల చంటిబాబు పిలుపునిచ్చారు. గోకవరం మండలం గంగంపాలెం, వెదురుపాక గ్రా మాల్లో సచివాలయాల వద్ద గురువారం జగనన్న సురక్ష సదస్సు లో జగ్గంపేట నియోజకవర్గం శాసనసభ్యులు జ్యోతుల చంటిబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్నా, ప్రభుత్వ పథకాలకు దూరంగా ఉన్న వారిని గుర్తించి సంక్షేమ పథకాలను అందించేందుకు జగనన్న సురక్ష పేరుతో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్యాంపుల్లో ఎలాంటి ఫీజులు వసూలు చేయకుండానే అర్హులకు సర్టిఫికెట్లు అందజేస్తున్నట్లు చంటిబాబు తెలిపారు. జగనన్నకు చెబుదాం కు అనుబంధంగా సమస్యల పరిష్కారానికి జగనన్న సురక్ష పేరుతో వలంటీర్లు, సచివాలయాల సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారని పేర్కొన్నారు. కుల, నివాస ధ్రువీకరణ సర్టిఫికెట్లతో పాటు ఆదాయ ధ్రువీకరణ, డేట్ ఆఫ్ బర్త్, మరణ ధ్రువీకరణ, మ్యుటేషన్ ఫర్ ట్రాన్సాక్షన్, మ్యుటేషన్ ఫర్ కరక్షన్స్, మ్యారేజ్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డులో మొబైల్ నంబర్ అప్‌డేట్, కౌలు గుర్తింపు కార్డులు (సీసీఆర్‌సీ), కొత్త రేషన్‌కార్డు లేదా రేషన్‌కార్డు విభజన, ప్రభుత్వ డేటాకు సంబంధించి కుటుంబ వివరాల్లో సభ్యుల పేర్ల తొలగింపు వంటి 11 సర్వీసులు ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. నోరు తెరిచి అడగలేని వారు, పొరపాటున ఎక్కడైనా, ఎవరైనా పథకాలు పొందకుండా మిగిలిపోయి ఉంటే వారికి కూడా మంచి చేసే కార్యక్రమే జగనన్నా సురక్షా కార్యక్రమమని తెలిపారు. జల్లెడ పట్టి మరీ అర్హులను గుర్తించి పథకాతో పాటు వారికి కావల్సిన డాక్యుమెంటేషన్లు కూడా ఇస్తున్నది జగనన్న వైఎస్ఆర్ ప్రభుత్వం మాత్రమేనని అన్నారు. నాలుగేళ్ల క్రితం రాష్ట్రంలో పరిస్థితులను గమనిస్తే ఏ గ్రామాన్ని తీసుకున్నా, ఏ వార్డును తీసుకున్నా, ఏ పట్టణాన్ని తీసుకున్నా.. ఏ పని కావాలన్నా ప్రభుత్వ కార్యాలయాలచుట్టూ, ప్రభుత్వ అధికారుల చుట్టూ, జన్మభూమి కమిటీల చుట్టూ తిరిగి లంచాలు ఇచ్చుకునే పరిస్థితి ఉండేదన్నారు. లంచాలు ఇచ్చుకుంటూ, వివక్షకు గురవుతూ ప్రజలు ఇబ్బంది పడేవారని, ఏ పనికోసం వెళ్లినా ఏ పార్టీకి చెందిన వారని అడిగేవారని పేర్కొన్నారు. నాలుగేళ్లలో పరిస్థితిని పూర్తిగా మార్చామని శాసనసభ్యులు జ్యోతుల చంటిబాబు వెల్లడించారు. పెన్షన్ కావాలన్నా.. రేషన్ కావాలన్నా నేరుగా ఇంటికే తీసుకువచ్చే గొప్ప వాలంటీర్ వ్యవస్థను తీసుకు వచ్చిన ప్రభుత్వం జగన్ను ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోపే ఈ వ్యవస్థను తీసుకు వచ్చి కులం చూడకుండా, మతం చూడకుండా, చివరకు వారు ఏ పార్టీవారో చూడకుండా, రాజకీయాలకు తావు లేకుండా, ఒక్క రూపాయికూడా లంచం ఇవ్వాల్సిన అవసరం లేకుండా, వివక్షకు తావు లేకుండా పారదర్శకంగా పౌరసేవలు అందించడం వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమే చేయగలిగిందని జ్యోతుల చంటిబాబు అన్నారు. రేషన్ కార్డులు కావాలని, ఇళ్లపట్టాలు కావాలని, పెన్షన్లు కావాలని, ఇంతకు ముందు రోజుల్లో ఎదురు చూసేవారన్నారు. పెన్షన్లు, రేషన్ కార్డులు, ఇళ్లపట్టాలు, ఎలాంటి సర్టిఫికెట్లు కావాలన్నా.. అత్యంత పారదర్శకంగా, లంచాలకు తావులేకుండా, వివక్షకు చోటు లేకుండా గ్రామస్థాయిలోనే ఇవన్నీ అందిస్తున్న ఘనత వైయస్సార్ ప్రభుత్వాని కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు పాల్గొన్నారు.

# ఘనంగా బాబూజగజ్జీవనరామ్ 37వ వర్ధంతి





గుడివాడ : ఎస్.సి.ఎస్.టి.బి.సి.ల అభ్యున్నతి కోసం అహర్నిశలు శ్రమించిన మహోన్నత వ్యక్తి బాబూ జగజ్జీవనరావ్‌న్ని 2టౌన్ సి.ఐ తులసీధర్, ఎమ్మార్పీఎస్ నాయకులు కంచర్ల సుధకార్‌లు అన్నారు. గురువారం స్థానిక గుడ్‌మెన్‌పేటలోని బాబూ జగజ్జీవన్‌రావ్ 37వ వర్ధంతి కార్యాక్రమని పురస్కరించుకుని జగజ్జీవనరావ్ విగ్రహానికి ఎస్సీ,ఎస్టీ, బిసి, మైనార్టీ నాయకులు విక్టర్ పాల్, వసంతవాడ దుర్గారావు, వడ్డాది నాగరాజు, పంచకర్ల వెంకట్, చాట్ల అజయ్‌లతో కలసి సిఐ తులసీధర్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగజ్జీవన్‌రావ్ తొమ్మిది సార్లు పార్లమెంటు సభ్యులుగా ఎన్నికవ్వటమే కాకుండా భారతదేశ ఉప ప్రధానిగా ఆయన ఎనలేని సేవలను అందించారన్నారు. ప్రతి ఒక్కరూ ఎదగాలనే ఉద్దేశ్యంతో ఎన్నో సంస్కరణలు చేపట్టిన మహానాయకుడన్నారు. ఆయన చూపిన బాటలో ప్రతి ఒక్కరూ పయనించాలన్నారు. వెంపటి సైమన్‌లతో కలసి కంచర్ల సుధాకర్ మాట్లాడుతూ జగజ్జీవనరావ్‌కు భారతరత్నను ఇవ్వాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో దళితనాయకులు గంధం సైమన్‌బాబు వేల్పుల నాగబాబు కొడాలి బాబు, వేశపోగు సుందరయ్య, అత్తాటి సాల్మన్, ఎం.ఏలీశా, పసాలాది శేఖర్, సురేఖ, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి ఆధ్వర్యంలో..

భారత మాజీ ఉపప్రధాని బాబూజగజ్జీవన్‌రావ్ 37వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన బాబూ జగన్‌జ్జీవనరావ్ చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రూరల్ అధ్యక్షులు వాసే మురళీ, మాజీ కౌన్సిలర్లు వసంతవాడ దుర్గారావు, శొంఠి రామకృష్ణ పొట్లూరి కృష్ణారావు, నాయకులు మద్దాల ఇసాక్, కంచర్ల సుధాకార్, కర్రే వెంకటగిరి, పరిశపోగు పోలయ్య, అందంకి కమల్, కాటూరి శ్రీను కొడాలి మనోజు, ఏసేభు, కొట్రా మరిదాసు, దొండపాటి మహేష్, జుజ్జవరపు వీరబద్రరావు, ఐనంపూడి సురేష్, వెమండ నాని,

వైకాపా ఆధ్వర్యంలో..

భారత మాజీ ఉపప్రధాని బాబూ జగజ్జీవన్‌రావ్ 37వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక గుడ్‌మెన్‌పేటలోని జాబు జగజ్జీవన్‌రావ్ు విగ్రహానికి, శరత్‌థియేర్‌లోని వైయస్ఆర్ పార్టీ కార్యాలయంలో ఎస్సీసెల్ పట్టణ అధ్యక్షా, కార్యదర్శులు రేమల్లి నీలాకాంత్(పసి), మామిళ్ల ఏలీశా అధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాబూ జగన్‌జ్జీవనరావ్ చిత్రపటానికి పట్టణా అధ్యకుడు గొర్ల శ్రీను, జిల్లా యువజన అధ్యక్షులు మెరుగుమాల కాళీలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు విక్టర్ పాలు, ఏలేటి విలియంజోషి, వెంపటి సైమన్, మామిళ్ళ రాజేష్, పసాలాది శేఖర్, తుళ్ళూరి ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఆర్ఐ వెనిగండ్ల ఆధ్వర్యంలో..

భారత మాజీ ఉపప్రధాని బాబూజగజ్జీవన్‌రావ్ 37వ వర్ధంతిని ఎన్ఆర్ఐ టిడిపి నాయకలు వెనిగండ్ల పౌండేషన్ అధినేత వెనిగండ్ల రాము అధ్వర్యలో ఘనంగా నిర్వహించారు. స్థానిక బైపాన్‌రోడ్లులోని వెనిగండ్ల కార్యాలయంలో ఏర్పాటు చేసిన బాబూ జగన్‌జ్జీవనరావ్ చిత్రపటాని కి సర్పంచ్ కైలా సుబ్బారావు, తంగిరాల మోహనదాసు, డెల్టా ప్రాజేక్టు కమిటి మాజీ చైర్మన్ గుత్తా శివరామకృష్ణ(చంటి), నిమ్మగడ్డ సాయిలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గడ్డం ప్రకాష్‌దాసు, నాయకలు పాల్గొన్నారు.

జనసేన ఆర్.కె ఆధ్వర్యంలో..

భారత మాజీ ఉపప్రధాని బాబూజగజ్జీవన్‌రావ్ 37వ వర్ధంతిని జనసేన నాయకలు మాచర్ల రామకృష్ణ(ఆర్.కె) అధ్వర్యలో ఘనంగా నిర్వహించారు. స్థానిక గుడ్‌మెన్‌పేటలోని జాబు జగజ్జీవన్‌రావ్ు విగ్రహానికి పూలవమాల వేసి నివాళ్ళు అర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు నూనే అయప్పా, షేక్ మీరాషరీఫ్, గంటా అంజీ, దివిలి సురేష్, పందిళ్ళ శ్రీను, చరణ్‌తేజ తదితరులు పాల్గొన్నారు.

## దళితుల ఆశాజ్యోతి డా. బాబు జగ్జీవన్ రామ్: టిడిపి



ఎమ్మిగనూరు ప్రజాపాలన ప్రతినిధి : మాజీ కేంద్ర మంత్రివర్యులు, తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి గారి ఆదేశాల మేరకు గురువారం స్థానిక కోట్ల క్యాంపు కార్యాలయం నందు డా. బాబు జగ్జీవన్ రామ్ గారి 37వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆ మహనీయుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టిడిపి నేతలు మాట్లాడుతూ....1908 ఏప్రిల్ 5న బీహార్ రాష్ట్రం, షాబాద్ జిల్లా, చాంద్వా గ్రామంలో... నిమ్న జాతి కులంలో జన్మించిన జగ్జీవన్ రామ్ బాల్యం నుంచే దేశభక్తిని పునికి పుచ్చుకొని జాతీయోద్యమమైన స్వాతంత్ర్య సంగ్రామంలో... పాల్గొని పరాయి పాలకులతో పోరాడిన గొప్ప స్వాతంత్ర సమరయోధుడని కొనియాడారు. కేంద్రంలో అనేక కీలక శాఖలకు మంత్రిగా, రక్షణ శాఖ మంత్రిగా, దేశానికి ఉప ప్రధానిగా సేవలు అందించి దేశ సమగ్రతకు, అభివృద్ధికి అహర్నిశలు శ్రమించిన పరిపాలనా దర్శకుడని తెలిపారు. 1971 లో.. పాకిస్తాన్ తో యుద్ధం చేసి గెలుపు సాధించి పెట్టి తూర్పు పాకిస్తాన్ ప్రస్తుతం "బంగ్లాదేశ్" కు స్వాతంత్ర్యం అందించి ప్రపంచంలోనే భారతదేశానికి గౌరవాన్ని, కీర్తిని ప్రసాదింప చేసిన ఘనత ఆ మహనీయునికే దక్కిందన్నారు. జగ్జీవన్ రామ్ మరణించేంతవరకు "ససారాం" లోకసభ స్థానం నుండి 9సార్లు పార్లమెంట్ సభ్యుడుగా ఎన్నికైన ఓటమెరుగని ప్రజా నాయకుడు అని కొనియాడారు. ఇలాంటి మహోన్నత నాయకుడు 1986 జూలై 6 న కన్నుమూసిన అణగారిన వర్గాల హృదయాలలో... చిరస్మరణీయుడుగా నేటికీ వెలుగొందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కదిరికోట ఆదెన్న, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపర (సగర) ఫెడరేషన్ మాజీ డైరెక్టర్ ఉప్పర ఆంజనేయులు, ముగతి వీరారెడ్డి, ఎమ్మిగనూరు మండలం మాజీ ఆత్మ చైర్మన్ కందనాతి శ్రీనివాసులు, టిడిపి ముస్లిం మైనార్టీ నాయకులు మేటి వలి భాష, టిడిపి యస్. సి. సెల్ నాయకులు రోజా ఆర్ట్స్ ఉసేని, కంపాడు చిన్న రంగన్న, యస్. సాల్మన్,6 వ వార్డు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న బటన్ నొక్కుడే కానీ.. లబ్ధిదారుల ఎకౌంట్లో కి రాని డబ్బులు : కొండ శ్రీను



గోకవరం , జూలై 6, ప్రజా పాలన: ఇదేం బటన్ నొక్కుడు జగనన్న లబ్ధిదారుల ఎకౌంట్లోకి రా నీ డబ్బులు అని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్మెంట్ కన్వీనర్ కొండ శ్రీను ఆరోపించారు. గురువారం గోకవరం మండలంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగనన్న ఉత్తుత్తి బటన్ నొక్కుడు కార్యక్రమం అని అందుకు డ్వాక్రా మహిళకు ఆసరా పథకంలో జగన్ను బటన్ నొక్కి మూడు నెలలు అయినా ఇప్పటికింకా వారి అకౌంట్లో డబ్బులు వేయలేని పరిస్థితి నెలకొందని కొండ శ్రీను అన్నారు. చదువుకునే పిల్లలకు అమ్మ ఒడి కోసం గత నెల 28వ తేదీన జగన్ను బటన్ నొక్కినప్పటికీ కొంతమంది పిల్లల తల్లుల ఖాతాలో ఇప్పటికి డబ్బులూ పడలేదన్నారు. మొదట్లో చదువుకునే పిల్లలు ప్రతి ఒక్కరికి అమ్మ ఒడి వేస్తామని మాటా ఇచ్చిన జగన్ను ఆ తర్వాత కుటుంబంలో ఒకరికి మాత్రమే అమ్మ ఒడి రూ 15 వేలు వేశారన్నారు. రెండో విడత రూ 14 వేలు, మూడో విడత రూ 13 వేలు వేశారన్నారు. నాలుగో విడత రూ13వేలు చాలామంది అమ్మాలకు డబ్బులు రాని పరిస్థితి నెలకొందని కొండా శ్రీను ఆరోపించారు. జగనన్న బటన్ నొక్కుడు పూర్తి అయిందని తెలుసుకున్న పలువురు మహిళామ్మతల్లులు పనులు మానుకుని బ్యాంకులు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ఎంతో ఖర్చు పెట్టి బటన్ నొక్కి కార్యక్రమం చేపడుతుందని, కానీ బటన్ నొక్కిన వెంటనే అకౌంట్లో డబ్బులు జమ కావట్లేదని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్మెంట్ కన్వీనర్ కొండ శ్రీను తెలిపారు. ఇప్పటికైనా జగనన్న వైఎస్ఆర్ ప్రభుత్వం బటన్ నొక్కుడుతో సరి పెట్టుకోకుండా లబ్ధిదారుల ఎకౌంట్లోకి తక్షణమే డబ్బులు జమ అయ్యేలా చర్యలు తీసుకుంటే బాగుంటుందని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్మెంట్ కన్వీనర్ కొండ శ్రీను జగనన్న వైఎస్ఆర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ముంపుకి గురువుతున్నాం ఇందిర మోడ్రన్ కాలనీవాసులు మొర



గోకవరం జూలై 6 ప్రజా పాలన:ఏజెన్సీ ముఖద్వారం మండల కేంద్రమైన గోకవరం మేజర్ పంచాయతీ పరిధిలోని ఇందిర మోడ్రన్ (ఎలుకలదిబ్బ) కాలనీ వాసూలు ముంపుకు గురి అవుతున్నామని బుధవారం ఎం పి పి సుంకర శ్రీవల్లి నాయకులు సుంకర వీరబాబు కు మొర పెట్టుకున్నారు. కాలనీ సంబంధించిన రోడ్డును కాలువగా మార్చడం వల్ల రోడ్డు లేక కాలవ నీరు కాలనీ లో పడి ఇల్లు మీదకు వస్తున్నాయని, రోడ్డు వేసి ముంపునకు గురి కాకుండా కాపాడాలని ఇందిరా మోడ్రన్ కాలనీ వాసులు ఎంపిపి సుంకర శ్రీవల్లి, నాయకులు సుంకర వీరబాబుకు వినతిపత్రాన్ని అందించారు. వెంటనే స్పందించిన ఎంపిపి సుంకర శ్రీవల్లి, నాయకులు సుంకర వీరబాబు ముంపునకు గురి అవుతున్న కాలనీ ని సందర్శించి సమస్యను స్వయంగా పరిశీలించి, మాట్లాడుతూ ముంపుకు గురిఅవుతున్న కాలనీ వాసులు సమస్యలు పరిష్కారానికి స్థానిక తహసీల్దార్ కి వివరించి, తొరలోనే రోడ్డు ఏర్పాటు చెయ్యడానికి కృషి చేస్తానని కాలనీ వాసులకు భరోసా కల్పించారు. ఈకార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తోలేటి రాంప్రసాద్, నరాలశెట్టి నరసయ్య, ఈఓపిఆర్డీ రాజేశ్వరరావు, అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

## ఒంటరి మహిళలకు ఆర్థిక భరోసా



సత్తెనపల్లి : ప్రజాపాలన : పట్టణ ఆర్యవైశ్య నాయకుడు, సామాజిక సేవకుడు వెలుగూరి శరత్ ఆధ్వర్యంలో కలాం చేయూత లో భాగంగా భారత మాజీ ఉప ప్రధాని జగజ్జీవన్ రామ్ వర్ధంతిని పురస్కరించుకొని పట్టణంలోని ఒంటరి మహిళ టి అనురాధ కు వెట్ గ్రైండర్ ( పిండి మర)అందించారు. గురువారం వైఎస్ఆర్సిపి కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ నాయకులు చల్ల చర్ల సాంబశివరావు మాట్లాడుతూ పేద వర్గాల ఆర్థిక చేయూత కోసం వెలుగూరి చేస్తున్న సేవలు ఆదర్శనీయమన్నారు. మహిళలు వీటిని సద్వినియోగం చేసుకొని కుటుంబ వనరులు మెరుగుపడేలా ప్రయత్నించాలన్నారు. కార్యక్రమంలో వైయస్సార్సీపి పట్టణ, రూరల్ కన్వీనర్లు సహేరా మౌలాలి, రాయపాటి పురుషోత్తమరావు ఎఎంసి చైర్మన్ పెండెం బాబురావు, పల్నాడు జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు అచ్యుత శివప్రసాద్, ధూళిపాళ్ల సొసైటీ చైర్మన్ నలబోతు శివన్నారాయణ, గుంటూరు జానీ, పెద్దింటి నాగేశ్వరరావు, రేపూడి రవితేజ, సెగ్గెం వెంకటేశ్వర్లు వల్లేమ్ నరసింహారావు, జూపల్లి పాలు, గొల్లపల్లి నాగేశ్వరరావు, నందిగం యల్లమంద తదితరులున్నారు.

## ఇరు కుటుంబ సభ్యులను పరామర్శించిన జ్యోతుల నెహ్రూ



గోకవరం ప్రజాపాలన జూలై 6, గోకవరం మండలం కొత్తపల్లి, రంపయర్రంపాలెం గ్రామాలకు చెందిన తెలుగు దేశం పార్టీ నాయకులు మాదారపు చక్రధర్, ప్రభాకర్ , నారా ప్రసాద్ లను గురువారం రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ పరామర్శించారు. గోకవరం మండలం తంటికొండ గ్రామంలో నారా ప్రసాద్ మాతృమూర్తి స్వర్గస్తులు కావడంతో నారా ప్రసాద్ ను, వారి కుటుంబ సభ్యులను జ్యోతుల నెహ్రూ పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అలాగే కొత్తపల్లి గ్రామానికి చెందిన మాదారపు చక్రధర్, ప్రభాకర్ మాతృమూర్తి మంగయ్యమ్మ స్వర్గస్తులు కావడంతో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో గోకవరం మండల టిడిపి అధ్యక్షులు మంగ రౌతు రామకృష్ణ, రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి ఉంగరాల రాము, బాదంపూడి ప్రకాష్. సత్యం పెద్దబ్బులు .పప్పు రాఘవులు ఈది అశోక్, నున్నం రాంబాబు, పిల్ల అర్జున్ సారధి, బదిరెడ్డి బాబి, దిండి రాజు, తంటికొండ గ నాగం వెంకటపతి, బదిరెడ్డి రవి, గేద్దం బాబు, ఆకుల కాశి, తదితరులు పాల్గొన్నారు.

## తెలుగుదేశంతోనే బాబూ జగ్జీవన్ రామ్ ఆశయాల సాధన సాధ్యం

**టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నల్లపాటి రామచంద్రప్రసాద్ (రాము)**



పల్నాడు జిల్లా. నరసరావుపేట. జూలై 6 (ప్రజాపాలన ప్రతినిధి.):బడుగు బలహీన వర్గాలు, దళిత సోదరుల యొక్క అభ్యున్నతి కోసం బాబూ జగ్జీవన్ రామ్ చేసిన సేవలు మరువలేనివని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నల్లపాటి రామచంద్రప్రసాద్ (రాము) అన్నారు. బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా గురువారం నరసరావుపేట పట్టణం పల్నాడు రోడ్డులో ఉన్న జగ్జీవన్ రామ్ విగ్రహానికి నల్లపాటి రాము పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలోని తెలుగుదేశంపార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే జగ్జీవన్ రామ్ ఆశయాలను నెరవేర్చే విధంగా పరిపాలన చేయబోతున్నారని భరోసా ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వంలో జరుగుతున్న అకృత్యాలన్నింటినీ విచారించడానికి ప్రత్యేక కోర్టులను కూడా ఏర్పాటు చేసే ఆలోచనలో చంద్రబాబునాయుడు ఉన్నారని వెల్లడించారు. జగన్ రెడ్డి పాలనలో బడుగు బలహీన వర్గాల ప్రజలు ఏ రకమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో ప్రతి రోజూ చూస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో తెలుగుదేశం ప్రభుత్వ పాలనలో కఠినమైన చట్టాలు తీసుకువచ్చి అన్ని వర్గాల ప్రజలకు భద్రత కల్పిస్తామన్నారు. బాబూ జగ్జీవన్ రామ్ ఆశయాలను నెరవేర్చే ఏకైక పార్టీ తెలుగుదేశంపార్టీ అని నల్లపాటి రాము పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశంపార్టీ నాయకులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

## దార్శనికుడు జగ్జీవన్ రామ్: యం ఆర్ పి ఎస్




ఎమ్మిగనూరు ప్రజాపాలన ప్రతినిధి : స్వాతంత్ర సమరయోధుడు, సంఘసంస్కర్త, బీహార్ రాష్ట్రం నుండి నిమ్న జాతుల నుండి వచ్చి భారతదేశ పార్లమెంటులో నలభై ఏళ్ల పాటు మంత్రి పదవులు చేపట్టి దేశ సమగ్రతకు, జాతి సమైక్యతకు అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషిచేసి విశిష్ట సేవలు అందించిన భారత మాజీ ఉప ప్రధాని డా. బాబూ జగ్జీవన్ రామ్ మనకందరికీ దార్శనికుడని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (యం ఆర్ పి ఎస్) రాష్ట్ర కార్యదర్శి జి. ఆనంద్ చైతన్య మాదిగ పేర్కొన్నారు. గురువారం ఎమ్మిగనూరు పట్టణంలో యం ఆర్ పి ఎస్ ఆఫీస్ లో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ గారి 37వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటమునకు పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణమాదిగ నాయకత్వంలో జగ్జీవన్ రామ్ కు భారతరత్న బిరుదు ప్రదానం చేసేలా కేంద్రం పై వత్తిడి తెచ్చి ఆ మహనీయుని ఆశయ సాధనకు కృషి చేస్తామన్నారు. భారతదేశంలో దళిత ,గిరిజనులకు డా. బి.ఆర్.అంబేద్కర్, డా. బాబు జగ్జీవన్ రామ్ లు రెండు కళ్ళు లాంటి వారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ కిషోర్, ఎమ్మార్పీఎస్ నాయకులు హల హర్వి గంధాలం ప్రభాకర్, డేవిడ్,ఆనంద్, మాజీ ఎంపీటీసీ రాముడు, గాలెన్న, ఏసేపు, ఇశ్రాయేలు, హానోకు, యస్. నాగలాపురం మాజీ ఎంపీటీసీ నాగరాజు, కంబలదిన్నె రాముడు, కందనాతి దేవదాసు, బూదూరు యాకోబు, జకరయ్య,దావీదు తదితరులు పాల్గొన్నారు

## కుప్ప రామలక్ష్మి అధ్వర్యంలో జనసైనికుడకు నిత్యవసర సరుకులు మరియు 5000 రూపాయల ఆర్థిక సహాయం



భీమిలి ప్రజాపాలన ప్రతినిధి జూలై 6: జనసేన పార్టీ భీమిలి నియోజకవర్గ ఇన్చార్జ్ పంచకర్ల సందీప్ గారి నాయకత్వంలో ఆనందపురం గ్రామం జనసేన పార్టీ ఎంపీటీసీ అభ్యర్థి కుప్ప రామలక్ష్మి ఆధ్వర్యంలో భీమిలీనియోజకవర్గం ఆనందపురం గ్రామం 24 కాలనీ లో జనసేన పార్టీ కార్యకర్త పీతల రమణ వయసు 32 కొద్దిరోజుల క్రితం ఎలక్ట్రీషియన్ పనిచేస్తూ ప్రమాదవశాత్తు గురికావడంతో హాస్పిటల్ లో చికిత్స కొరకు జాయిన్ చేయగా ఒక సంవత్సరం పాటు ఏటువంటి పనికి వెళ్ళడానికి కుదరదు అని డాక్టర్స్ చెప్పడం తో రమణ ఇంటిలో అతనే పెద్దదిక్కు కావడంతో రమణ పేద కుటుంబ అవడంతో ఇంటిలో తినడానికి కూడా అవస్త పడుతున్నట్టు జనసేనికులకు తెలియడం తో ఆనందపురం మండలం జనసైనికులు నిత్యవసర సరుకులు మరియు ఐదు వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించడం జరిగింది స్థానిక జనసేన పార్టీ ఎంపీటీసీ అభ్యర్థి కుప్ప రామలక్ష్మి మాట్లాడుతూ జనసేనికులకు ఎటువంటి కష్టం వచ్చినా ముందు వుండి ఆదుకుంటామని రాబోయే రోజుల్లో జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ గారిని గెలిపించుకుంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బాగుంటుందని అధికారం లేకపోయినా పేద కుటుంబాలకు రైతులకు ఎటువంటి కష్టం వచ్చినా కొన్ని లక్షల రూపాయలు ఆయన సొంత నిధులు అందిస్తున్నారని అదే పవన్ కళ్యాణ్ గారిని మనం గెలిపించుకుంటే చదువుకున్న యువతకు ఉద్యోగాలు కల్పన నిరుపేదలకు ఉపాధి కల్పన మరియు నిత్యవసర సరుకులు రేట్లు తగ్గిస్తారని చెప్పడం జరిగింది ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొన్నవారు స్థానిక జనసేన పార్టి ఎంపీటీసీ అభ్యర్థి కుప్ప రామలక్ష్మి మండల జెడ్పిటిసి అభ్యర్థి దుక్క వెంకటరావు పాలవలస ఎంపీటీసీ అభ్యర్థి తమ్మిన అప్పలరాజు గొట్టిపల్లి ఎంపిటిసి అభ్యర్థి తాడివాడ శివకృష్ణ ఆనందపురం మండలం జనసేన పార్టీ నాయకులు మీసాల నాగేశ్వరరావు కొట్టాడు కిరణ్ బొద్దపు గోవింద్ తాడివాడ ప్రశాంత్ రౌతు నాగరాజ ముడసల శ్రీను ఇమంది శ్రీనివాసు రావు కార్తిక్ అప్పారావు గణేష్ రాజు బాలు లోకేష్ రాము శ్రీను గ్రామస్తులు పాల్గొనడం జరిగింది

## నియోజకవర్గ మహిళా ప్రధాన కార్యదర్శిగా మొగిలిపువ్వు నాగలక్ష్మి



పల్నాడు జిల్లా. నరసరావుపేట. జూలై 6.( ప్రజాపాలన ప్రతినిధి): నరసరావుపేట నియోజకవర్గ మహిళా ప్రధాన కార్యదర్శిగా పట్టణానికి చెందిన మొగలిపువ్వు నాగలక్ష్మిని నియమిస్తూ గురువారం నాడు తెలుగుదేశం పార్టీ కార్యాలయం ప్రకటన జారీ చేసింది. పార్టీ కార్యాలయంలో నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్-ఛార్జ్ డా. చదలవాడ అరవింద బాబు మహిళా నాయకురాల సమక్షంలో నాగలక్ష్మికి నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం నాగలక్ష్మి మహిళా ప్రధాన కార్యదర్శిగా అవకాశం కల్పించిన డా. చదలవాడను శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా డా. చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ.....తీసుకున్న మహిళా ప్రధాన కార్యదర్శి పదవికి న్యాయం చేయాలని పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకుపోవడంలో చురుగ్గా వ్యవహరించాలన్నారు. పదవి తీసుకున్న తర్వాత పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకు పోవడంలో ఆలస్యం వహిస్తే సహించేది లేదన్నారు. పార్టీకి సేవ చేసిన వారిని తెలుగుదేశం పార్టీ ఎప్పటికీ మర్చిపోదని పార్టీ అధికారంలోకి వచ్చాక వారి కష్టానికి తగ్గ ప్రతిఫలం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళ అధ్యక్షురాలు దాసరి ఉదయ్ శ్రీ,నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు జల్లిపల్లి శేషమ్మ, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ పులిమి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయాలతో ప్రజల ముంగిటకు పాలన:సామినే ని వెంకట కృష్ణ ప్రసాద్ బాబు



నందిగామ కొండూరు గ్రామ సచివాలయం నందు జ గనన్న సురక్ష కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జగ్గయ్యపేట నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు సామినేని వెంకట కృష్ణ ప్రసా ద్ బాబు పాల్గొన్నారుఈ సందర్భంగా ప్రసాద్ బాబు మాట్లాడుతూ అర్హత కలిగిన వారికి ప్రభుత్వం నుంచి అందాల్సిన పథకాలను చేజారకుండా చూసేందుకే జ గనన్న సురక్ష కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. గతంలో సర్టిఫికెట్లు తీసుకోవాలంటే ఉదయం నుండి సాయంత్రం వరకు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. నేడు జగనన్న సురక్ష ద్వారా మన గ్రా మ సచివాలయం వద్ద ఎటు తిరగకుండా ఉచితంగా సర్టిఫికెట్లు అందడం జరుగుతుందన్నారు. మొత్తం 11 రకాల సర్వీసులు జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అందివ్వడం జరుగుతుందని దానిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారుఅనంతరం పంచాయతీ ద్వారా గ్రామ ప్రజలకు ఉచితంగా డస్ట్ బిన్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్,తాసిల్దార్ నరసింహారా వు,గ్రామ సర్పంచ్ కొర్రపాటి అచ్చారావు,,కో కన్వీనర్ బెల్లంకొండ సురేష్,సచివాలయం సిబ్బంది,వాలం టీ ర్లు,రైతు సోదరులు పాల్గొన్నారు.

## 108 అంబులెన్సులను ప్రారంభించిన ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను



జగ్గయ్యపేట జులై 6 ప్రజా పాలన ప్రతినిధి:రాష్ట్ర ప్ర భుత్వం నుండి నూతనంగా మంజూరైన 2 అంబులెన్సులను గురువారం నాడు జగ్గయ్యపేట పట్టణం మి ట్టగుడెం నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వవిప్ ,జగ్గయ్యపేట నియోజకవర్గ శాసనసభ్యులు సామినేని ఉదయభాను ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ108 అంబులెన్స్ సేవలను మరింత బలోపేతం చేసే దిశగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గారు కొత్త అంబులెన్సును ఉపయోగంలోకి తీసుకు వచ్చినట్లు తెలిపారునూతనంగా ప్రారంభించిన అం బులెన్సు జగ్గయ్యపేట మండలానికి మరియు వత్స వాయి మండలానికి ఒకటి చొప్పున కేటాయించారని తెలిపారు. ఆపద సమయంలో రోగులు,ప్రమాదంలో గురైన క్షతగాత్రులు గాని వారిని చూసినవారు కానీ వారి ప్రాణాలను రక్షించేందుకు 108 నెంబర్కు కాల్ చేసి ప్రాణాలను కాపాడాలని కోరారు. ఈ కార్యక్ర మం లో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు ,మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర,వైస్ చై ర్మన్ తుమ్మల ప్రభాకర్,పట్టణ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ షేక్ మస్తాన్,కమిషనర్ నాగమల్లేశ్వరరావు,తదితర వార్డు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## భారతదేశ దళిత పీడిత వర్గాల తొలి ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



నందిగామ జులై 6 ప్రజాపాలన ప్రతినిధి: గాంధీ సెం టర్ నందు గురువారం నాడు బాబు జగజీవన్ రా మ్ వర్ధంతిని పురస్కరించుకొని మాజీ శాసనసభ్య రా లు తంగిరాల సౌమ్య ఆయ న విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటమి తెలియనటువంటి మ హెూన్న తమైన వ్యక్తి డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ ని తెలియజే శారు.

## ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతో జగనన్న సురక్ష ఎమ్మెల్యే మొండితోక జగన్మోహన్



కంచికచర్ల జూలై 6 ప్రజాపాలన ప్రతినిధి.ప్రజా సమ స్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించండిమే జగనన్న సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని శా సనస భ్యు లు డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు అన్నారు మండల పరిధిలోని మొగులూరు, గాని ఆత్కూరు గ్రామంలో గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని అ ర్జీదారులకు ధ్రువపత్రాలను అందజేశారు ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలందరికీ సంక్షేమ పథకాలు మెరుగైన సేవలు అందించాలని లక్ష్యంతో యజ్ఞంలో జగనన్న సురక్ష అమలు చేశారన్నారు ప్ర జల నుంచి వినతులు అందిన వెంటనే అప్పటికప్పుడే అక్కడికక్కడే పరిష్కరించేలా గ్రామ వార్డు సచివాలయాల వద్ద మండల స్థాయి అధికారుల ఆ ధ్వర్యంలో జగనన్న సురక్ష సేవలు అని కొనియాడారు ఈ కార్యక్రమంలో మండల డెవలప్మెంట్ అధికారి బాల శంకర్, జెడ్పిటీసీ సభ్యురాలు వేల్పుల. ప్రశాంతి, ఎంపీపీ మాలిక్ బషీర్ గ్రామ సర్పంచులు బండి. మ ల్లికార్జునరావు, స్థానిక ఎస్ ఐ సుబ్రహ్మణ్యం, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి మత్తులో నడుస్తున్న యువత ఆందోళనలో తల్లిదండ్రులు



రాజుపాలెం ప్రజాపాలన ప్రతినిధి: మండల కేంద్రమైన రాజుపాలెం ప్రభుత్వ వైన్ షాప్ పరిధిలో చిరు వ్యాపారాలు చేసుకొంటు కైని ప్యాకెట్ల ముసుగులో గంజాయి అమ్ముతున్నారు అని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి, మధ్యం ధర కన్నా తక్కువ ధరలో గంజాయి అందిస్తామంటూ ఒకటి రెండు దమ్ములతో స్వర్గలోకాలను చుట్టిరావచ్చంటూ చిరు వ్యాపారులు కూడా గంజాయితోనే ఎక్కువ లాభాలు పొందచ్చని ఆశతో మత్తుకి అలవాటు పడ్డ యువతకి మందుబాబులుకి విక్రయిస్తూ వారి జేబులో నింపుకుంటూ మత్తులో ఉన్న యువత మందుబాబుల జేబులకు చిల్లు పెడుతున్నారు... చర్యలు తీసుకోవాల్సిన అధికారులు గంజాయి మత్తు కన్నా మామూళ్ల మత్తేమిన్న అన్నట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## ర్యాబీస్ వ్యాధి టీకాల ద్వారనే నయం: జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా॥ దివాకర్



గుడివాడ : జూనోసిస్ డేను పురస్కరించుకుని గురువారం స్థానిక రావి భద్రయ్య వెటర్నరీ పాలీక్లినిక్‌లో సుమారు 350 కుక్కలకు ఉచితంగా రాబీస్ వ్యాధీ నివారణ టీకాలను వేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిబిరాన్ని ప్రారభించిన జిల్లా పశుసంవర్ధక శాక అధికారి డా॥ ఎం.ఎస్.ఏ దివాకర్ మాట్లాడుతూ రాబీస్ వ్యాధి తదితర వ్యాధుల గూర్చి వివరించి, నివారణ మార్గాలపై అవగాహన కల్పించారు. ర్యాబీస్ వ్యాధి టీకాల ద్వారానే నయం అవుతుందన్నారు. రాబీస్వ్యాధి అంటువ్యాధి లాంటిదని, ఈవ్యాధి సోకిన కుక్క మనిషిని కరిస్తే ఆమనిషి తప్పనిసరిగా ఈ టీకాను వేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి డైరెక్టర్ రత్న శ్రీ, వైద్యులు, ఆఫీసు సిబ్బంది, పశువైద్యశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల వద్దకే పాలన సాక్షాత్కారం



రాజుపాలెం ప్రజాపాలన : ప్రభుత్వ యంత్రాంగం నేరుగా మీ ఇంటికి వచ్చి, మీ సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి , అవసరమైన ధృవీకరణ పత్రాలకు ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసి లిగౌరవనీయంగా మీ సమస్యల పరిష్కరిస్తూ..., ద్రవీకరణ పత్రాలు అందించడమే జగనన్న సురక్ష కార్యక్రమమని సర్పంచ్ అన్నారు. అంచులవారి పాలెం గ్రామ సచివాలయం వద్ద జరిగిన జగనన్న సురక్ష శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఇంకా ఈ కార్యక్రమంలో మండల తాసిల్దార్ నలిని గారు ,మండల ఈవోపీఆర్డి ముక్కంటి గారు, మండల అగ్రికల్చరల్ ఆఫీసర్ వెంకట్రామయ్య గారు ,మండల వైస్ ఎంపీపీ హరి సూరమ్మ నాగేశ్వరరావు గారు, వైస్ సర్పంచ్ గలభ ధనలక్ష్మి గారు, వెంకటేశ్వర్లు గారు, ఐసిడిఎస్ ప్రాజెక్టు సూపర్వైజర్ రమాదేవి గారు, గ్రామ సచివాలయ కన్వీనర్ ఏపూరి స్వామి శంకర్రావు గారు, సెక్రటరీ ముక్తార్ గారు, గృహ సారధులు, వాలంటీర్లు మరియు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా స్ఫూర్తి ప్రధాత బాబూ జగజ్జీవన్ రామ్: ఒమ్మి రఘురామ్



జగ్గంపేట ప్రజాపాలన ప్రతినిధి :1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలుకు వెళ్ళిన నేత బాబూ జగజ్జీవన్ రామ్ అని ఆయన ప్రజా స్ఫూర్తి ప్రధాత అని వై యస్ ఆర్ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,రామచంద్రాపురం అసెంబ్లీ పార్టీ పరిశీలకులు ఒమ్మి రఘురామ్ అన్నారు. బాబూ జగజ్జీవన్ రామ్ గారి వర్ధంతి పురస్కరించుకొని ఈరోజు జగ్గంపేట లో హరిజనపేట లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సుమారు 28 సంవత్సరాలు కేంద్రమంత్రిగా వివిధ శాఖలు నిర్వహించి రికార్డు సృష్టించిన నాయకులు బాబూ జగ్జీవన్ రామ్ అని,జీవిత పర్యంతం దేశ సేవకే అంకితమై, నవభారత నిర్మాణానికి పునాదులు వేసిన దార్శనికుడని, ఆలోచనల్లోని పరిపక్వత, మాటల్లోని సూటిధనం, నిర్ణయాల్లో లోతైన అవగాహన ఉన్న నాయకుడని, కష్టాల్లో కృంగిపోక మొక్కవోని ధైర్యం ఆయనది అని, చర్చల్లో పదునైన మేధావితనం, ప్రత్యర్ధులతో సైతం ఔరా అనిపించే రాజనీతిజ్ఞత, తర్కం, లోతైన విషయ పరిజ్ఞానం ఆయన సొంతమని, నాయకత్వ విలక్షణతలు కలిగిన దేశ నాయకుడని కొనియాడారు, అటువంటి జగజీవన్ రామ్ గారిని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు, ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు చెరుకూరి జయరాజ్,ఆకుల శ్రీధర్,జగ్గంపేట మండలం సేవాదళ్ కన్వీనర్ కిలపర్తి వీరబాబు,వైసీపీ నాయకులు నీలపల్లి అప్పారావు,దత్తి శ్రీనివాస్, బ్రమాం, అశోక్,సూరిబాబు, జల్లు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వాలు రకరకాల పేర్లతో పిలిచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలి



పల్నాడు జిల్లా. నరసరావుపేట.జూలై 6( ప్రజా పాలన ప్రతినిధి) :కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రకరకాల పేర్లతో పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని స్మార్ట్ మీటర్లు పెట్టవద్దని రెండవ రోజు దీక్షలో పాల్గొన్న ఎస్సీ ఎస్టీ బీసీ ముస్లిం మైనారిటీ ఐక్యవేదిక జాతీయ అధ్యక్షులు డాక్టర్ పొనుగుపాటి పూర్ణచంద్రరావు. పూలమాల వేసి దీక్షను ప్రారంభించిన నరసరావుపేట తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ డాక్టర్. చదలవాడ అరవిందబాబు. సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజల ఇబ్బందులు పడుతున్నారని ఒకవైపు కరెంట్ బిల్లు మరోవైపు నిత్యవసర సరుకులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న రాష్ట్ర ప్రభుత్వం నిమ్మక నీరు ఇచ్చినట్లుగా ఉందని అన్నారు తక్షణమే కరెంట్ బిల్లులు తగ్గించాలి స్మార్ట్ మీటర్లు రద్దు పరచాలని అన్నారు ఈ కార్యక్రమంలో కె కృష్ణ , కెవిన్పిఎస్ నాయకులు రామారావు , షేక్ కరిముల్లా , ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు కొండలు , పి కే ఎస్ నాయకులు షేక్ దర్యావలి, పిడిఎఫ్ జిల్లా అధ్యక్షులు వేంపాటి విజయలక్ష్మి , ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శి మొన్న షరీఫ్ , రాష్ట్ర మైనార్టీ సంఘం అధికార ప్రతినిధులు,, గోదా జాన్ పాల్ జై భీమ్ భారత పార్టీ నరసరావుపేట నియోజకవర్గం ఇంచార్జ్ , భరత్ బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి , రమాదేవి బీసీ జనసం రాష్ట్ర అధ్యక్షులు, అర్జున్ రావు మాజీ సర్పంచ్ , మారాట ఝాన్సీ . దాసరి ఉదయశ్రీ టిడిపి పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు, కొండలు రజక సంఘం పట్టణ నాయకులు, ఎస్ శాంతి ఎస్వీ నాగేశ్వరావు , హ్యూమన్ రైట్స్ సొసైటీ చైర్మన్ తదితరులు ఐక్యవేదిక తరపున దీక్షలో పాల్గొన్న వారికి మద్దతు ఇచ్చారు.

# జాతి దార్శనికుడు జగ్జీవన్ రామ్

**సామాజిక సమానత్వం కోసం అలుపెరగని కృషి చేసిన బాబూజీ**

**ఎస్సీ సెల్ పల్నాడు జిల్లా అధ్యక్షులు లిచిలక జైపాల్లి ఆధ్వర్యంలో జగ్జీవన్ కు ఘన నివాళి**



సత్తెనపల్లి: ప్రజాపాలన ప్రతినిధి: అట్టడుగు వర్గాలలో జన్మించి, భారతదేశ ఉపప్రధానిగా ఎదిగిన బాబు జగ్జీవన్ రామ్ సేవలు స్ఫూర్తివంతమని, ఆయన జాతి దార్శనికుడని వైయస్సార్సీపి నాయకులు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని వైఎన్ ఆర్ సిపి కార్యాలయంలో పల్నాడు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు చిలక జైపాల్ ఆధ్వర్యంలో జగజ్జీవన్ రామ్ 37 వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ముందుగా బాబూజీ చిత్రపటానికి, అమరావతి బస్ పాయింట్లో విగ్రహానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ నాయకులు చల్లంచర్ల సాంబశివరావు, ఏఎంసీ చైర్మన్ పెండెం బాబురావు, పట్టణ రూరల్ కన్వీనర్లు సహారా మౌలాలి, రాయపాటి పురుషోత్తమరావు తదితరులు మాట్లాడుతూ జగజ్జీవన్ రామ్ స్వాతంత్ర్య సమరయోధుడిగా, అనేక మంత్రిత్వ శాఖలను సమర్ధవంతంగా నిర్వహించిన నేతగా, సుదీర్ఘకాలం పార్లమెంటేరియన్ గా దేశానికి అందించిన సేవలు స్ఫూర్తివంతమన్నారు. స్వాతంత్రం పోరాటంలో పాల్గొంటూనే సామాజిక సమానత్వం కోసం విశేషంగా కృషి చేసిన మహనీయుడన్నారు. సుదీర్ఘకాలం పార్లమెంటేరియన్ గా పనిచేసి అనేక మంత్రిత్వ శాఖలను సమర్ధంగా నిర్వహించారన్నారు. హరిత విప్లవ పితామహుడని ,రాజ్యాంగబద్ధంగా ఆయన నిర్వహించిన అన్ని మంత్రిత్వ శాఖలోనూ రిజర్వేషన్లు అమలు చేసిన ఘనత బాబూజీదే నని కొనియాడారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు అచ్యుత శివప్రసాద్, ధూళిపాళ్ల సొసైటీ చైర్మన్ నల్లమోతు శివన్నారాయణ , రేపూడి రవితేజ, జూపల్లి పాల్,చిలక రమణయ్య, సెగ్గెం వెంకటేశ్వర్లు, గని, వెలుగూరి శరత్, గుంటూరు జానీ, వల్లెం నరసింహారావు, పెద్దింటి నాగేశ్వరరావు , చిలక డాని, గొల్లపల్లి నాగేశ్వరరావు,చిలక నాగేశ్వరరావు,నందిగం యలమంద, భట్లూరి కోటేశ్వరరావు, వేంకటేశ్వర్లు, చిలక పెదబాబు,కూచిపూడి సైమాన్ తదితరులున్నారు.

# చిరస్మరణీయుడు కందుల కొండయ్య దొర



**3వ వర్ధంతి సభలో జ్యోతుల నెహ్రూ**

జగ్గంపేట ప్రజాపాలన ప్రతినిధి.: కాకినాడ జిల్లా గండేపల్లి జూలై 6: గండేపల్లి మండలం మురారి గ్రామంలో గ్రామ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ నేత కందుల కొండయ్య దొర మూడవ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా మురారి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కొండయ్య దొర విగ్రహానికి పూలమాలవేసి అంజలి ఘటించారు. అనంతరం బ్రహ్మంగారి ఆలయం వద్ద విశ్వబ్రాహ్మణ సంఘం నూతనంగా ఏర్పాటు చేసిన కొండయ్య దొర విగ్రహాన్ని సందర్శించి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా నెహ్రూ మాట్లాడుతూ 1991 ఉప ఎన్నికల్లో నాతో ప్రయాణం ప్రారంభించాడని ఒక రాష్ట్ర స్థాయి నాయకుడిగా తయారు చేశానని జగ్గంపేట నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ బలోపేతం కావడానికి విశేష కృషి చేసిన కొండయ్య దొర ఇక్కడ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని అందుకే విశ్వబ్రాహ్మణ సంఘం బ్రహ్మంగారి మందిరం ఆవరణలో విగ్రహం పెట్టడం దైవాంశ సంభూతుడిగా కొనియాడారు. జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ గా జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడిగా రాష్ట్రగిడ్డంగుల సంస్థ చైర్మన్ గా రాష్ట్ర హౌసింగ్ బోర్డ్ చైర్మన్ గా గండేపల్లి మండల టిడిపి అధ్యక్షుడిగా వైస్ ఎంపీపీగా అనేక పదవులు అలంకరించి పదవులకే వన్నెతెచ్చిన నాయకుడు కొండయ్య దొర అని ఈ ప్రాంతంలో ఎవరికి ఆ పదొచ్చినా నేనున్నానంటూ ఆదుకున్న వ్యక్తి కొండయ్య దొర మనకు దూరమై మూడు సంవత్సరాలు గడుస్తున్నా మన మధ్య ఉన్నట్టుగా ఉంటుందని ఆయన సేవలు మరువలేనివని ఆయన చిరస్మరణీయులని అన్నారు. ఈ కార్యక్రమంలో కందుల చిట్టిబాబు, కోర్పు లచ్చయ్యదొర , ఎస్ వి ఎస్ అప్పలరాజు, పోతుల మోహనరావు, కోర్పు సాయి తేజ, మారిశెట్టి భద్రం, సుంకవిల్లి రాజు, అడబాల వెంకటేశ్వరరావు, కొత్త కొండబాబు, కొత్త బైరవ కృష్ణ, కందుల కొండయ్య చౌదరి, దా పత్తి సీతారామయ్య, గోరజాల వెంకన్న దొర, గద్దె అబ్బన్న, ఉండవల్లి వీర్రాజు, ఎర్రం శెట్టి బాబ్జి, ఉండవల్లి బుల్లి రాజు, చంద్రాల మల్లేశ్వరరావు, చంద్రాల పెద్ద వెంకన్న దొర, చావా బుల్లిదొర, జాస్తి పల్లపురాజు, నిమ్మలపూడి రాంబాబు, ఉండవల్లి శ్రీను, దారా ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

# ఆస్తి తగాదాలే హత్యలకు ముఖ్య కారణం



**పల్నాడు జిల్లా ఎస్పీ వై. రవిశంకర్ రెడ్డి ఐపిఎస్**

పల్నాడు జిల్లా .నరసరావుపేట .జూలై 6 (ప్రజాపాలన ప్రతినిధి): ఆస్తి తగాదాలే హత్యలకు ముఖ్య కారణం మనిపల్నాడు జిల్లా ఎస్పీ వై. రవిశంకర్ రెడ్డి ఐపిఎస్ అన్నారు.సత్తెనపల్లి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ధూళిపాళ్ళ గ్రామంలో గురువారం హత్యలు జరిగిన సంఘటనా స్థలాలను పరిశీలించిన ఎస్పీ రవిశంకర్ రెడ్డి.శుక్రవారం ఈ సందర్భంగా సత్తెనపల్లి టౌన్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఎస్పీ రవిశంకర్ రెడ్డి మాట్లాడుతూ ధూళిపాళ్ళ గ్రామంలో పెద్ద మీరా సాహెబ్ మరియు చిన్న మీరా సాహెబ్ అని ఇద్దరు అన్నదమ్ముల పిల్లలకు మధ్య ఉన్న ఆస్తి తగాదాల నేపథ్యంలో ఈ ఘటన జరిగినదని అన్నారు. పెద్ద మీరా సాహెబ్ కొడుకు ఖాసింనకు చిన్న మీరా సాహెబ్ కొడుకు రహిమాన్ రూ.5000/- నగదు ఇవ్వడం జరిగినది. ఈ నగదు గురించి రహిమాన్ తన పెదనాన్న కొడుకు అయినా ఖాసింను గట్టిగా అడగగా వీరి మధ్య గతంలో ఉన్న ఆస్తి తగాదాలను మనసులో పెట్టుకొని, వారిని చంపితే మిగిలిన ఆస్తి కూడా తమకే వస్తుందన్న దురుద్దేశంతో ఖాసిం తన కొడుకు జాకీర్ సహాయంతో నిన్న అనగా 05.07.2023 తేదీన ఉదయం 11:30 గంటల సమయంలో రహిమాన్ ను హత్య చేయడం జరిగినది. హత్య చేసిన తర్వాత ఖాసిం తన కొడుకు జాకీర్ తో కలసి ధూళిపాళ్ళలోని తన బాబాయ్ ఇంటికి వెళ్లి ఇంట్లో ఉన్న బాబాయ్ భార్య రహిమూన్ ను మరియు ఆమె కుమార్తె మాలింబిని అతి కిరాతకంగా మారణాయుధాలతో దాడి చేసి హత మార్చడం జరిగినది. ఈ మూడు హత్యల ఘటనకు సంబంధించి సమగ్ర దర్యాప్తునకు సత్తెనపల్లి డి.ఎస్.పి ఆదినారాయణ ని ప్రత్యేక అధికారిగా నియమించి, త్వరితగతిన నిందితులను అరెస్టు చేసి దర్యాప్తు పూర్తి చేసి, నిందితులకి కఠిన శిక్షలు పడేవిధంగా తగిన చర్యలు తీసుకోవాలని డిఎస్పీ ని ఆదేశించడం జరిగినది. హత్యలు జరిగిన ప్రదేశాలను పరిశీలించి అక్కడ హత్యలకు సంబంధించిన సాంకేతిక మరియు భౌతిక సాక్షాదారాలను క్షుణ్ణంగా పరిశీలించి, సేకరించాలని మరియు హత్య చేయడానికి ఉపయోగించిన ఆయుధాలను జాగ్రత్తగా సేకరించి భద్రపరచాలని పోలీస్ అధికారులకు సూచించడం జరిగింది. ఈ హత్యల ఘటనకు సంబంధించి నమోదైన కేసులో దర్యాప్తును త్వరితగతిన పూర్తిచేసి, చార్జషీటును వీలైనంత త్వరగా కోర్టు నందు దాఖలు చేయాలని డిఎస్పీ ఆదినారాయణ కి సూచించడం జరిగినది. తదుపరి గ్రామంలో ఎటువంటి శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా తగిన ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించడం జరిగినది. ఈ కార్యక్రమంలో డిఎస్పి బి. ఆదినారాయణ , సిఐ ప్రభాకర్ , సత్తెనపల్లి రూరల్ సిఐ కోటేశ్వరరావు , సత్తెనపల్లి టౌన్ సిఐ శోభన్ బాబు , ఎస్సైలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.



## నేడు విజయవాడలో జరిగే కార్మిక సంఘాల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

**ఏఐటీయూసీ పల్నాడు జిల్లా కన్వీనర్ కాసారాంబాబు**



పల్నాడు జిల్లా .నరసరావుపేట. జూలై 6 (ప్రజాపాలన ప్రతినిధి): పల్నాడు జిల్లా నరసరావుపేటలో ఏఐటీయూసీ కార్యాలయం నందు కాసా రాంబాబు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపైన రేపు ఉదయం 10 గంటలకి ఎంబి భవన్ విజయవాడలో కార్మిక సంఘాల సదస్సు జరుగుతుందని ఈ సదస్సుకు ఏ ఐ టి సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ జి ఓబులేసు మరియు కార్మిక సంఘాలా నేతలు పాల్గొనున్నారు ఆగస్టు 9న క్విట్ ఇండియా స్ఫూర్తితో క్విట్ మోడీ సేవ్ ఇండియా నినాదంతో కార్మిక వర్గాన్ని చైతన్యవంతం చేస్తూ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాల అవలంబిస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ రాజకీయ ఆర్థిక విధానాల పైన పోరాటాలని ముందుకు తీసుకెళ్లేందుకు ఈ సదస్సు దోహదపడుతుందని అంతే కాకుండా విశాఖ స్టీల్ ప్లాంట్ కాపాడుకుందామని ప్రభుత్వ రంగ సంస్థలను రక్షించుకుందామని లేబర్ కోడ్ లను రద్దు చేయాలని ఆదానీ అంబానీలకు దేశ సంపదనుదోసిపెట్టే విధానాలకి వ్యతిరేకంగా కార్మిక సంఘాల ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పోరాటం కొనసాగిస్తామని ఆయన పిలుపునిచ్చారు ఈ సమావేశంలో ఏఐటియుసి అధ్యక్ష కార్యదర్శులు ఉప్పలపాటి రంగయ్య వైదన వెంకట్ వగ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## బిజేపి విశాఖ జిల్లా కిసాన్ మోర్చ లో ఆధ్వర్యంలో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు




భీమిలి ప్రజాపాలన ప్రతినిధి జూలై 6: బిజేపి విశాఖ జిల్లా కిసాన్ మోర్చ అధ్యక్షులు,పి.వి.వి. ప్రసాదరావు పట్నాయక్ ఆధ్వర్యంలో విశాఖ జిల్లా బిజేపి పార్టీ కార్యాలయంలో మరియు విశాఖ జిల్లా భీమిలి నియోజకవర్గంలో ఆనందపురం మండలం లో భారతీయ జనతా పార్టీ పూర్వ జనసంఘ్ పార్టీ సంస్థాపక అధ్యక్షులు స్వర్గీయ డా.శ్యామా ప్రసాద్ ముఖర్జీ గారి జయంతి వేడుకలు జరిగాయి.బిజెపి రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ఉప్పాడ అప్పారావు,విశాఖ జిల్లా కిసాన్ మోర్చ నాయకులు లెంక శ్రీరామ్,అనీల్ రాజు,పాల్గొని శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డా.శ్యామా ప్రసాద్ ముఖర్జీ గారు మాజీ కేంద్ర మంత్రివర్యులు గా పనిచేశారన్నారు."ఏక్ భారత్" లక్ష్యం కోసం తన ప్రాణాలను బలిదానం చేసిన మహానేతని కొనియాడారు,భరత మాత ముద్దు బిడ్డ.స్వర్గీయ డా.శ్యామా ప్రసాద్ ముఖర్జీ గారి జయంతి నేడు.ఈ సందర్భంగా ఆయన మన దేశానికి అందించిన సేవలను స్మరించుకుంటు వారికి హృదయ పూర్వకంగా నమస్సుమాంజలి తెలియజేశారు.మనం అందరం సాంస్కృతిక జాతీయవాదంతో వారు చూపిన ఉద్యమ స్ఫూర్తితో అఖండ భారతావని నిర్మాణం కోసం పని చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి కిసాన్ మోర్చ నాయకులు బోర శ్రీను, ఇంటి సత్తిరాజు మళ్లారపు కృష్ణ,బిజెపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## పోలీస్ అవుట్ పోస్ట్‌ను ప్రారంభించిన ఏసీపీ జనా ర్దన్ నాయుడు, మొండితోక అరుణ్ ఎమ్మెల్యే జగన్‌మోహన్ రావు





నందిగామ జులై 6 ప్రజా పాలన ప్రతినిధి:పట్టణంలో ని ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన పోలీస్ అ వుట్ పోస్టును శాసనసభ్యులు మొండితోక జగన్ మోహన్ రావు శాసనమండలి సభ్యులు మొండితోక అరుణ్ కుమార్ ఏసీపీ జనార్ధన్ నాయుడుతో కలిసి గురువారం ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రిలో పోలీస్ అవుట్ పో స్ట్ ప్రారంభించడం వలన అనేక ప్రయోజనాలు ఉ న్నా యని.రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు లేదా రాత్రి స మయంలో ఎమర్జెన్సీ కేసులు ఆసుపత్రికి వచ్చినప్పు డు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పోలీస్ సి బ్బంది చర్యలు తీసుకుంటారని చెప్పారు. అదేవిధం గా ఆసుపత్రిలో ఎప్పుడు పోలీస్ సిబ్బంది అందుబా టులో ఉండటం వలన ఎటువంటి అవాంఛనీయ ఘ టనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవడం జరుగు తుందన్నారు.ఈ కార్యక్రమంలో సిఐ లు హనీష్, నా గేంద్ర కుమార్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ గు డివాడ సాంబశివరావు, సూపర్డెంట్ కే సత్యనారా య ణ, కౌన్సిల్ సభ్యులు పాకాలపాటి కిరణ్, యాకు బ్ అలీ, కో ఆప్షన్ షేక్ జాఫర్, గద్దె రమేష్, షేక్ కరీము ల్లా, షేక్ సైదా తదితరులు పాల్గొన్నారు




# తెలుగు రిలీజ్ కి వస్తున్న లేటెస్ట్ కోలీవుడ్ హిట్ సినిమా..!

ప్రస్తుతం మన తెలుగులో డబ్బింగ్ అవుతూ మరిన్ని చిత్రాలు కన్నడ నుంచి గాని తమిళ్ సినిమా నుంచి గాని విడుదల అవుతున్న సంగతి తెలిసిందే. అలాగే గత కొన్నాళ్ల కితమే కోలీవుడ్ నుంచి మొదట అక్కడ రిలీజ్ అయ్యి తర్వాత తెలుగులో రిలీజ్ కి వచ్చిన చిత్రం "విడుదల 1" కాగా ఇపుడు మరో హిట్ సినిమా అయితే తెలుగు వెర్షన్ రిలీజ్ కి వస్తుంది.మరి తమిళ నాట సీనియర్ నటుడు వడివేలు, యంగ్ హీరో ఉదయనిధి స్టాలిన్ ప్రధాన పాత్రల్లో మరో టాలెంటెడ్ నటుడు ఫహద్ ఫాజిల్ మరియు హీరోయిన్ కీర్తి సురేష్ లు ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రమే "మామన్నన్". మరి ఈ చిత్రాన్ని మారి సెల్వరాజ్ దర్శకత్వం వహించగా ఈ చిత్రానికి లెజెండరీ సంగీత దర్శకుడు ఏ ఆర్ రెహమాన్ సంగీతం అందించడం విశేషం. మరి ఈ సినిమాలో తమిళ్ లో పెద్ద హిట్ గా నిలవగా ఇప్పుడు ఈ సినిమా తెలుగు వెర్షన్ అయితే "నాయకుడు" పేరిట రిలీజ్ కావడానికి సిద్ధం అవుతున్నట్టుగా అనౌన్స్ అయింది. ఇక ఈ చిత్రాన్ని తెలుగులో అయితే ప్రముఖ నిర్మాణ సంస్థలు సురేష్ ప్రొడక్షన్స్ వారు అలాగే ఆసియన్ సినిమాస్ వారు ఈ జూలై 14న రిలీజ్ చేస్తున్నట్టుగా ప్రకటించారు. మరి తెలుగులో ఈ చిత్రం ఎలా రాణిస్తుందో చూడాలి.




# "సలార్" తెలుగు రాష్ట్రాల బిజినెస్ ఉహించని లెవెల్లో?




పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ చిత్రాల్లో ఇక ఈ ఏడాది రిలీజ్ కి రానున్న రెండో భారీ చిత్రమే "సలార్". మరి స్టార్ దర్శకుడు ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్న ఈ మాసివ్ యాక్షన్ డ్రామా నుంచి ఈరోజే క్రేజీ టీజర్ ని మేకర్స్ రిలీజ్ చేయగా ఈ టీజర్ ఇప్పుడు ఫ్యాన్స్ లో స్లో డ్రగ్ లా అయితే ఎక్కుతుంది. ఇక ఇదిలా ఉండగా సలార్ బిజినెస్ కి సంబంధించి కూడా క్రేజీ రూమర్స్ ఇప్పుడు వినిపిస్తున్నాయి.మరి ఈ చిత్రం అయితే తెలుగు స్టేట్స్ లో భారీ బిజినెస్ కి నాంది పలుకుతున్నట్టుగా తెలుస్తుంది. మరి ఈ సినిమాకి ఒక్క తెలుగు రాష్ట్రాల హక్కులే 200 కోట్లకి పైగా మేకర్స్ కోట్ చేస్తున్నట్టుగా తెలుస్తుంది. దీనితో ఒక్క తెలుగు బిజినెస్ లో మరోసారి బిగ్గెస్ట్ బిజినెస్ నెంబర్ సలార్ కి లాక్ అయ్యేలా ఉందని చెప్పాలి. అయితే ఇది ఇంకా క్లోజ్ అవ్వలేదు కానీ ప్రస్తుతానికి అయితే ఆ రూమర్ వినిపిస్తుంది. మరి ఆదిపురుష్ కి వచ్చినట్టే ఏదన్నా అఫీషియల్ నెంబర్ బయటకి వస్తుందో లేదో చూడాలి.


# నవీన్ పొలిశెట్టి.. లక్కీ లేడీతో ఏమవుతుందో..

విభిన్న కథలను ఎంచుకుంటూ టాలీవుడ్ లో దూసుకుపోతున్న యువ హీరో నవీన్ పొలిశెట్టి. ఆయన హీరోగా స్టార్ హీరోయిన్ అనుష్క జంటగా కలిసి నటిస్తున్న చిత్రం మిస్ శెట్టి మిస్టర్ పొలి శెట్టి. ఈ సినిమాతో అనుష్క చాలా కాలం తర్వాత తెరపై కనిపించనుందది. అందులోనూ అనుష్క లాంటి స్టార్ హీరోయిన్ యువ హీరో నవీన్ పొలిశెట్టితో చేయడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఇప్పటికే రిలీజ్ చేసిన టీజర్ ట్రైలర్ లు విపరీతంగా ఆకట్టుకున్నాయి.ప్రముఖ నిర్మాణ యువీ క్రియేషన్స్ బ్యానర్పై మహేష్ బాబు.పి దర్శకత్వంలో వంశీ ప్రమోద్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా ప్రపంచ వ్యాప్తంగా ఆగస్ట్ 4న తెలుగు తమిళ కన్నడ మలయాళ భాషల్లో గ్రాండ్ రిలీజ్ కానుంది. ప్రస్తుతం ఈ సినిమా ప్రమోషన్స్లో యూనిట్ దూకుడు పెంచేసింది.ఇప్పటికే రిలీజ్ చేసిన టీజర్ పాటలకు మంచి స్పందన వచ్చిన సంగతి తెలిసిందే. స్టార్ హీరో ధనుష్ పాడిన పాట కూడా అందరినీ బాగా ఆకట్టుకుంది.కాగా తాజాగా ఈ మూవీ నుంచి మరో సాంగ్ కి సంబంధించి ఓ అప్ డేట్ ఇచ్చారు. అనుష్కను లక్కీ లేడీ గా పరిచయం చేస్తూ ఓ పోస్టర్ విడుదల చేశారు.ఇది థర్డ్ సింగిల్ కి సంబంధించిన పోస్టర్ కావడం విశేషం.లేడీ లక్ అంటూ సాగే ఈ థర్డ్ సింగిల్ను జూలై 7న రిలీజ్ చేస్తామని మేకర్లు ప్రకటించారు. కాగా ఈ పోస్టర్లో అనుష్క నవీన్ పొలిశెట్టిలు ఎంతో స్టైలీష్గా కనిపిస్తున్నారు.అన్విత రవళి శెట్టి పాత్రలో అనుష్క.. స్టాండప్ కమెడియన్ సిద్ధు పొలిశెట్టి పాత్రలో నవీన్ పొలిశెట్టి కనిపించనున్నారు. పి మహేష్ దర్శకత్వంలో యువి క్రియేషన్స్ బ్యానర్ లో తెరకెక్కుతున్న ఈ చిత్రంపై మంచి అంచనాలు ఉన్నాయి.వీరిద్దరి మధ్య కెమిస్ట్రీ ఎలా ఉండబోతోంది.. అసలు ఈ చిత్రంలో అనుష్క గ్లామర్.. నవీన్ కామెడీ టైమింగ్ ఎలా ఉండబోతున్నాయి అనే




ఉత్కంఠ తీరాలి అంటే మూవీ ప్రేక్షకులు ముందుకు వచ్చే వరకు ఆగాల్సిందే.

# బాలయ్య సిల్వర్ జూబ్లీ రికార్డ్..!




బాలకృష్ణ గోపీచంద్ మలినేని కాంబినేషన్ లో వచ్చిన సినిమా వీర సింహా రెడ్డి. బాలయ్య మార్క్ మాస్ ఎంటర్టైనర్ గా దర్శకుడు గోపీచంద్ తెరకెక్కించిన ఈ సినిమా ఆయన కెరీర్ లోనే బిగ్గెస్ట్ హిట్ గా నిలిచింది. అయితే ఒకప్పుడు స్టార్ హీరోల సినిమాలు అంటే 100 రోజులు 150 రోజులు 175 రోజులు 200 రోజుల రికార్డ్ ఉండేది. అయితే ప్రస్తుతం ఈ డిజిటల్ యుగంలో రిలీజైన వారం రోజుల్లోనే మాక్సిమం వసూళ్లు రాబట్టేస్తున్నారు. సినిమా హిట్టైనా మాక్సిమం 3 వారాలు.. ఫ్లాప్ అయితే వారం లో థియేటర్ ల నుంచి తీసేస్తున్నారు.ఈ టైం లో సినిమా సిల్వర్ జూబ్లీ ఆడటం రికార్డ్ అని చెప్పొచ్చు. బాలకృష్ణ నటించిన వీర సింహారెడ్డి సినిమా ఆంధ్రప్రదేశ్ లోని కర్నూలు జిల్లా ఆలూరు లో శ్రీ లక్ష్మి నరసింహ థియేటర్ లో రోజుకి 4 ఆటలతో జూలై 5న 175 రోజులు పూర్తి చేసుకుంది.వారం రెండు వారాలకే ఎంత సక్సెస్ అయినా సినిమా తీసేస్తున్న ఈ టైం లో ఇన్ని రోజులు ఒకే థియేటర్ లో సినిమా ఆడటం ఒక రికార్డ్ అయితే.. బాలకృష్ణ నటించిన అఖండ కూడా ఇక్కడ 175 రోజులు ఆడటం మరో విశేషం.సో అలా చెప్పుకుంటే రెండు సిల్వర్ జూబ్లీ సినిమాలు అది కూడా హీరో డ్యుయల్ రోల్ చేసిన సినిమాలు 175 రోజులు ఆడటం అది ఒక్క బాలకృష్ణ వల్లే సాధ్యమైంది. ఈ రికార్డ్ ఇంకెవరు కూడా బ్రేక్ చేయలేరనే చెప్పాలి. ఇదివరకు స్టార్ హీరోలందరూ డ్యుయల్ రోల్ సినిమాలు సిల్వర్ జూబ్లీ హిట్ కొట్టినా ఇలా వరుసగా రెండు సినిమాల్లో డ్యుయల్ రోల్ చేసి రెండు సినిమాలు 175 రోజులు ఆడించడం మాత్రం బాలకృష్ణకు మాత్రమే సాధ్యమైంది.ఇదే ఉత్సాహంతో రాబోతున్న భగవంత్ కేసరి సినిమా కూడా ఈ రికార్డ్ బ్రేక్ చేస్తుందని అంటున్నారు ఫ్యాన్స్. అనిల్ రావిపుడి డైరెక్షన్ లో వస్తున్న ఈ సినిమాలో బాలయ్య మళ్లీ డ్యుయల్ రోల్ లో కనిపిస్తారా లేదా అన్నది క్లారిటీ రాలేదు.భగవంత్ కేసరి సినిమా దసరా కానుకగా రిలీజ్ ఫిక్స్ చేశారు. ఈ సినిమాలో కాజల్ అగర్వాల్ హీరోయిన్ గా నటిస్తుండగా శ్రీ లీల ఇంపార్టెంట్ రోల్ లో కనిపిస్తుంది. థమన్ మ్యూజిక్ అందిస్తున్న భగవంత్ కేసరి సినిమా నుంచి రీసెంట్ గా వచ్చిన టీజర్ అంచనాలు పెంచేసింది.

# సాలిడ్ టీఆర్పీ రేటింగ్ రాబట్టిన "విరూపాక్ష"




టాలీవుడ్ యంగ్ హీరో, సుప్రీం స్టార్ సాయి ధరమ్ తేజ్ ప్రధాన పాత్రలో, డైరెక్టర్ కార్తిక్ దండు దర్శకత్వం లో తెరకెక్కిన మిస్టరీ యాక్షన్ థ్రిల్లర్ విరూపాక్ష. ఈ చిత్రం థియేటర్ల లో రిలీజ్ అయ్యి ప్రేక్షకులను, అభిమానులని విశేషం గా ఆకట్టుకుంది. బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లను కూడా రాబట్టిన ఈ సినిమా, రీసెంట్ గా వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్ గా స్టార్ మా లో ప్రసారం అయ్యింది. అయితే ఈ చిత్రానికి బుల్లితెర పై సూపర్ రెస్పాన్స్ వచ్చింది. 11.68 టీఆర్పీ రేటింగ్ ను నమోదు చేయడం జరిగింది. సాయి ధరమ్ తేజ్ ఈ చిత్రం తో కెరీర్ లో సూపర్ సక్సెస్ ను సొంతం చేసుకున్నాడు. ఈ చిత్రం లో మీనన్ హీరోయిన్ గా నటించింది. సుకుమార్ రైటింగ్స్ మరియు SVCC పతకాల పై నిర్మించిన ఈ సినిమాకి అజనీష్ లోక్ నాథ్ సంగీతం అందించారు.

# రౌడీ హీరో సినిమా సూపర్ అప్డేట్..!

రౌడీ హీరో విజయ్ దేవరకొండ ఖుషి సినిమా పూర్తి చేసే పనిలో ఉన్నాడు. ఈ సినిమాతో పాటుగా పరశురాం దర్శకత్వంలో ఒక సినిమా.. గౌతం తిన్ననూరి డైరెక్షన్ లో మరో సినిమా లైన్ లో పెట్టాడు విజయ్ దేవరకొండ. లైగర్ రిజల్ట్ తో మొహమాటాలకు పోకూడదని గట్టిగా ఫిక్స్ అయిన రౌడీ హీరో కంటెంట్ బాగుంది అనుకుంటేనే సినిమా ఒకే చేస్తున్నాడుఖుషి తర్వాత చేస్తున్న రెండు సినిమాల మీద విజయ్ చాలా కాన్ఫిడెంట్ గా ఉన్నాడని తెలుస్తుంది. పరశురాం సినిమా పాన్ ఇండియా ఉంటుందా లేదా అన్నది డౌటే కానీ గౌతం తిన్ననూరి తో మాత్రం పాన్ ఇండియా సినిమా ప్లాన్ చేస్తున్నాడు విజయ్.పరశురాం సినిమా ఈ నెల 12 నుంచి రెగ్యులర్ షూట్ మొదలవుతుందని తెలుస్తుంది. ఫ్యామిలీ ఎంటర్టైనర్ గా రాబోతున్న



ఈ సినిమాలో విజయ్ సరసన మృణాల్ ఠాకూర్ హీరోయిన్ గా నటిస్తున్న విషయం తెలిసిందే.మృణాల్ తో పాటుగా సినిమాలో మరో హీరోయిన్ కూడా నటించే అవకాశాలు ఉన్నాయని తెలుస్తుంది. అయితే ఆ ఛాన్స్ ఎవరికి వస్తుందో తెలియాల్సి ఉంది. విజయ్ పరశురాం ఆల్రెడీ గీతా గోవిందం సినిమాతో హిట్ అందుకున్నారు. అందుకే ఈ కాంబో మీద భారీ హైప్ క్రియేట్ అయ్యింది.గీతా గోవిందం తర్వాత కూడా వీరిద్దరు మళ్లీ అదే టైప్ ఫ్యామిలీ సినిమాతో వస్తున్నారని తెలుస్తుంది. ఈ సినిమాకు ఫ్యామిలీ స్టార్ కుటుంబరావు అనే టైటిల్స్ పరిశీలనలో ఉన్నాయి. చిత్ర యూనిట్ మాత్రం ఫ్యామిలీ స్టార్ అన్న దానికే ఎక్కువ ప్రిఫరెన్స్ ఇస్తున్నారట. ఈ సినిమా కొంత పార్ట్ యూఎస్ లో కూడా షూటింగ్ చేయాల్సి ఉందట. అయితే ఫస్ట్ షెడ్యూల్ మాత్రం హైదరాబాద్ లో మొదలు పెట్టి ఆ తర్వాత షెడ్యూల్ కి ఫారిన్ వెళ్తారని తెలుస్తుంది.పరశురాం విజయ్ దేవరకొండ కాంబోలో వస్తున్న ఈ సినిమాను దిల్ రాజు నిర్మిస్తున్నారు. సినిమాను నెక్స్ట్ ఇయర్ సమ్మర్ కి రిలీజ్ ప్లాన్ చేస్తారని తెలుస్తుంది. ఖుషి సినిమా పాన్ ఇండియా రిలీజ్ ప్లాన్ చేయగా పరశురాం సినిమా కూడా పాన్ ఇండియా రేంజ్ లో ఉంటుందా లేదా అన్నది త్వరలో తెలుస్తుంది. పరశురాం గౌతం తిన్ననూరి ఈ ఇద్దరి దర్శకులతో చేస్తున్న సినిమాలు ఒకేసారి మొదలు పెట్టి ఒకేసారి పూర్తి చేయాలని విజయ్ ప్లాన్ చేస్తున్నాడు. మరి అది ఎంతవరకు సాధ్యం అవుతుందో చూడాలి.


జై భీమ్

బహుజన రాజ్యాధికార సాధనలో నీవు కూడా గెలవాలంటే MAM ను ఆచరించాలి

MAM అంటే

M : ఆశయా లకు ,నీకు ,మద్దతు ఇచ్చే వాళ్ళని మెంబర్స్ గా చేసుకోవాలి, నిన్ను ఇష్టపడే వాళ్ళని నాయకుడిగా నామినేట్ చేయాలి

A : నిన్ను నీ కమిటీలను కాపాడటానికి అడ్వకేట్స్ కమిటీని పెట్టాలి

M : నిన్ను ప్రపంచానికి పరిచయం చేసి నాయకుడుగా గెలిపించడానికి ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మీ చేతిలో ఉండాలి

శివ భాగ్య రావు బహుజన్,IRS-vrs
చైర్మన్ & నేషనల్ కన్వీనర్

పూలే అంబేడ్కర్ రాజ్యాధికారం సమితి (PARS)

జై పూలే | జై భీమ్ | జై బహుజన్ | జై భారత్


Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printed & published at Unyted Publications, From H.no: #50-61,-3, Rajendra Nagar, Seethampet, Visakhapatnam-16. and SREE SESHASAI ENTERPRISES "D.NO : 3-88, "C/O CHANDRA THEATER," GOSALA VILLAGE, "MAIN ROAD, PENAMALURU MANDAL, KRISHNA DT, ANDHRAPRADESH, India. Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com
PIN: 521151."MOBILE :9912333140 Email : sreeseshasaivja@gmail.com.